Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

మంగళవారం, ఆగస్టు 12, 2025 | సంపుటి - 20 | సంచిక 312 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు

### హెచ్చరించిన జారీ చేసిన భారత వాతావరణ శాఖ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వాతావరణం మళ్లీ ఒక్కసారిగా మారిపోతోంది. ఈ క్రమంలోనే భారత వాతావరణ శాఖ దేశంలోని పలు రాష్ట్రాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ-, ఉత్తరప్రదేశ్, బీహార్, ఝార్ఖండ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో



2

# కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికే ముఖ్యం

### మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు

### స్పీకర్ పరిధిలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

### మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



కరీంనగర్ : మేడిగడ్డ ప్రాజెక్ట్ లాంటి సంఘటనలు జరుగకుండా జాగ్ర త్తలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యా నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ముందుకెళ్తామని తెలిపారు. మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులో ఎవరెవరిని విచారణకి పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం లేదని స్పష్టత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌పై అధికారులే విచారణ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారిగా ఒప్పందం చేసుకుందని విమర్శించారు. తమ మేనిఫేస్టో లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యూడీషనల్ ఎంక్వైరీ 2లో

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

### రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం ద్వారా సాయం

### మెయిన్స్‌కు ఎంపికైన వారికి లక్ష చెక్కు అందించిన భట్టి



హైదరాబాద్ : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్-2025లో మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మిగతా 2లో

## లోక్‌సభ ముందుకు కొత్త ఆదాయపన్ను చట్టం

### ప్రవేశ పెట్టిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు కేంద్రం సిద్ధమైన సంగతి తెలిసిందే. 2లో



# పార్లమెంట్‌లో అదే రభస

### బీహార్ వ్యవహారంపై చర్చకు పట్టు

### ఉభయ సభలు వాయిదా

### అనుమానాల నివృత్తిపై భేటీకి ఇసి సమ్మతి

## 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతం



### ఎంపిల ర్యాలీకి పోలీసుల అనుమతి నిరాకరణ

### ర్యాలీని అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు

న్యూఢిల్లీ : బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. 2లో

## లోక్‌సభలో నాలుగు కీలక బిల్లులకు ఆమోదం

ఐటి, స్పోర్ట్స్ బిల్లులకు సభ మద్దతు 2



## సిఎం రేవంత్ రెడ్డికి ఊరట

### ఎన్నికల కేసును కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్ : సిఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది.

## కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు

న్యూఢిల్లీ : కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. సెలక్షన్ కమిటీ- చేసిన సిఫార్సుల మేరకు కొత్త బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు.

## పాక్ ఆర్మీచీఫ్ అణు ప్రేలాపనలు

### పాక్ కుతంత్రాలను ప్రపంచం గమనిస్తోంది

### తిప్పి కొట్టిన భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ : అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడి క్రమంలో ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడింది. మిగతా 3లో

# 14న కరీంనగర్‌లో బిసి కదనభేరి

### బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర

### ఏర్పాట్లను పరిశీలించిన మాజీమంత్రులు



కరీంనగర్ : బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ ఆరో పించారు. బిసిలకు న్యాయం జరగాలంటే తమిళనాడు తరహాలో పోరాడాలని తాము కాంగ్రెస్‌కు సూచించినట్లు- చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ ఈనెల 14న కరీంనగర్‌లో 'బిసి కదనభేరి' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించ నుంది. ఈ సభకు పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముఖ్య అతిథిగా హాజరుకా నున్నారు. సభకు సంబంధించిన సన్నాహక సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. మిగతా 2లో



# సమస్యల పరిష్కారంలో పట్టువిడుపులు ఉండాలి

### షూటింగ్‌ల నిలిపివేత సరైన నిర్ణయం కాదు

### కలసి చర్చించుకోవాలని కార్మికు సంఘాలకు మంత్రి సూచన

హైదరాబాద్ : తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఉన్న సమస్యలు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. పట్టువిడుపులతో ఉండాలని నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులకు మంత్రి సూచించారు. ఒకరి ఇబ్బందులను మరొకరు అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కమిటీ- ఏర్పాటు- చేసుకోవాలని.. నిర్మాతలు, ఫెడరేషన్ ప్రతినిధులు మంగళవారం మరోసారి చర్చించుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దిల్ రాజుకు మంత్రి సూచించారు. సినీ కార్మికుల వేతనాలు పెంచాలని గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిల్మ్ ఫెడరేషన్ షూటింగ్‌లను నిలివేస్తున్నట్లు- నిర్ణయం తీసుకుంది. మిగతా 2లో

## వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి

### ఇంకెంతమాత్రం జాప్యం చేయడం సరికాదు

### తరలింపు ప్రక్రియను అడ్డుకుంటే కఠిన చర్యలు

### ఢిల్లీ అధికారులకు సుప్రీకోర్టు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ : దిల్లీ, ఎన్సీఆర్‌లలోని అన్ని వీధి కుక్కల బెడదపై సుప్రీం తీవ్రంగా స్పందించిది. వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. అలాగే జంతు ప్రేమికులు ఈ విషయంలో అడ్డుకుంటే సహించేది లేదని తెలిపింది. ఈ పక్రియకు ఆటంకం కలిగించే ఏ వ్యక్తి లేదా సంస్థ అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా హెచ్చరించింది. 2లో



# వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు

వచ్చే మూడు నుంచి ఏడు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసర యాత్రలు చేయొద్దని ఐఎండీ అధికారులు సూచిస్తున్నారు. ఢిల్లీ-ప్రాంతంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని ఐఎండి చెబుతోంది. ఇక్కడ ఎల్లో అలర్ట్ జారీ అయింది. గరిష్ట ఉష్ణోగ్రత 34-36శాతం. ఈ మధ్య, కనిష్ట ఉష్ణోగ్రత 26-28శాతం ఈ మధ్య ఉంటుందట. ఆగస్టు 13, 14 తేదీల్లో వర్షం కారణంగా చల్లగా అనిపిస్తుంది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, లక్నో, గోరఖ్‌పూర్, వారణాసి, మీరట్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఇక్కడ రోజువారి ఉష్ణోగ్రత 32-35శాతం. రాత్రి 24-27శాతం మధ్య ఉంటుంది. బీహార్‌లోని దక్షిణ జిల్లాలు గయా, పట్నా, నవాడా, భాగల్పూర్‌లలో ఆగస్టు 12 నుంచి 14 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ అయింది. నవాడాలో గంగా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటు-తోంది. ఉత్తర బీహార్‌లో మోస్తరు వర్షాలతో పాటు- 40-50 కి.మీ వేగంతో గాలులు, పిడుగులు పడే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కాబట్టి, ఈ ప్రాంతాల్లో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలి. ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 12న రెడ్ అలర్ట్ జారీ అయింది. ఉత్తర కాశీ, రుద్ర ప్రయాగ్, చమోలీ, బాగేశ్వర్, పిథోరాగఢ్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లో 13 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందట. ఆగస్టు 13, 14 తేదీలకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుంది. డెహ్రాడూన్, బాగేశ్వర్‌లలో భారీ వర్షాల కారణంగా పాఠశాలలు మూసివేశారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున, ఈ ప్రాంతంలో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, సోలన్, షిమ్లా, సిర్మౌర్, మండీ, చంబా, కాంగ్రా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఆగస్టు 12న భారీ వర్షాలు, ఆ తర్వాత 13, 14 తేదీల్లో మోస్తరు వర్షాలతో పాటు 30-40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా. మన తెలంగాణలో కూడా ఆగస్టు 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఒఃఉ హెచ్చరించింది. ఆగస్టు 13 నుంచి 17 వరకు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కాబట్టి, లోతట్టు- ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

# లోక్‌సభ ముందకు కొత్త ఆదాయపన్ను చట్టం

ఇందులో భాగంగానే ఆదాయపు పన్ను (నం.2) బిల్లు-2025ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఈ బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరిలోనే కేంద్రం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. అయితే.. విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాన్ని సెలెక్ట్ కమిటీకి పంపించింది. కమిటీ- ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం.. దానికి అనుగుణంగా నవీకరించి మరోసారి లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. అదేవిధంగా టాక్సేషన్ చట్టాల (సవరణ) బిల్లునూ ప్రవేశపెట్టింది. సెలెక్ట్ కమిటీ- సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు- కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

# కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండటంతో సభలో బిల్లుపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. ఈ బిల్లును రాజ్యసభ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ముందుకు వెళు తుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారి 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో లోక్‌సభలో కేంద్రం ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. దానిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో బిల్లును సెలక్ట్ కమిటీ-కి పంపించింది. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని పార్లమెంటు సెలెక్ట్ కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం కొత్త ఆదాయపు పన్ను బిల్లు-2025ను ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెలక్ట్ కమిటీ- సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు- మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్లలో ఎన్నో సవరణలు జరిగాయి. సంక్లిష్టంగా తయారన ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్లో ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో కొత్త బిల్లును రూపొందించారు. సవరించిన కొత్త బిల్లు దశాబ్దాల నాటి పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరం చేస్తుందని, వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, అనవసరమైన వ్యాజ్యాలను నివారించడానికి సహాయపడుతుందని బైజయంత్ పాండా అన్నారు.

# వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి

6 వారాల్లోపు వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలని తెలిపింది. అన్ని కుక్కలను క్రిమిరహితం చేసి శాశ్వతంగా ఆశ్రయాలకు తరలించాలని ఉత్తర్వులో న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ లేకుండా ఈ పక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని అధికారులకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ ఆదేశాలు జారీ చేసింది. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని చెప్పింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. వీధి కుక్కల దాడుల వల్ల దిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయంపై విచారణ కొనసాగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టు-కొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది. వీధికుక్కల తరలింపు ప్రదేశాలపై జస్టిస్ పార్దివాలా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరగా.. ఇందుకోసం ఇప్పటికే ఓ ప్రదేశాన్ని గుర్తించారని తెలిపారు. జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ పొందడంతో ఆ పనులు నిలిచిపోయాయని న్యాయ స్థానానికి వివరించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ పార్దివాలా 'ఆ జంతు ప్రేమికులందరూ కలిసి రేబిస్‌తో ప్రాణాలు కోల్పోయిన వారిని తిరిగి తీసుకురాగలుతారా?' అని ప్రశ్నించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని అన్నారు. కుక్కల కోసం వెంటనే షెల్టర్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

# సివిల్స్ ప్రిపేర్ అవుతున్న వారికి అండ

ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్-2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగ పడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచించ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టు-కోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ- సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. ఢిల్లీలో నా క్వార్టర్స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# పార్లమెంట్‌లో అదే రభస

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల ఆందోళలతో పార్లమెంట్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆందోళనకు దిగాయి. బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాల్సిందేనని పట్టుబట్టాయి. బీజేపీతో ఈసీ కుమ్మక్కైకందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. స్పీకర్ సముదాయించే ప్రయత్నం చేసిన విపక్షాలు వెనక్కి తగ్గలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పార్లమెంట్ ఉభయ సభలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మరోవైపు.. ఓట్ల చోరీ జరుగుతుదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈసీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఇండియా కూటమిలోని 25 ప్రతిపక్ష పార్టీల నుంచి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొననున్నారు. అయితే, ఇండియా కూటమి నేతల ర్యాలీకి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఇండియా బ్లాక్ ఎంపీల ర్యాలీపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలావుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లో జరుగుతున్న ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సరిగా లేదని ఆరోపిస్తూ ఇండియా కూటమి భారీ ఆందోళనకు సిద్ధమైంది. సోమవారం ఢిల్లీలోని పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీస్ వరకు 300 మందికి పైగా ఎంపీలు ర్యాలీ చేయబోతున్నారు. అయితే, ఈ ర్యాలీకి ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి తమకు ఎలాంటి అధికారిక వినతి అందలేదని సీనియర్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇండియా కూటమి మాత్రం ర్యాలీ నిర్వహించి తీరాలని నిర్ణయించారు. ఇలాంటి సమయంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష పార్టీ నేతలతో భేటీకి ఎన్నికల సంఘం అంగీకరించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంట్ సభ్యుడు జైరాం రమేష్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. భేటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జైరాం రమేష్ లేఖపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు జైరాం రమేష్‌కు ఎన్నికల సంఘం సెక్రటరీ అశ్వినీ కుమార్ మోహల్ ఆదివారం రాత్రి లేఖ రాశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఎక్కువ మంది పట్టే అవకాశం లేనందున కేవలం 30 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సుకుమార్ సెన్ హాల్‌లో సమావేశం జరగనుంది. అయితే, ఎన్నికల సంఘం భేటీకి అంగీకరించిన నేపథ్యంలో ర్యాలీపై ఇండియా కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. కాగా, 2024 ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో దాదాపు 1,00,250 ఓట్లు చోరీ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు.

# లోక్‌సభలో నాలుగు కీలక బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ : విపక్షాల నుంచి సర్‌పై నిరసనలు గందరగోళం నడుమనే లోక్‌సభలో సోమవారం మొత్తం నాలుగు కీలకమైన బిల్లులు ఆమోదం పొందాయి. రెండు ఆదాయపు పన్ను పన్నుల వసూళ్లకు సంబంధించినవి, మరో రెండు క్రీడావిధానాల సంస్కరణల పరిధిలోకి వచ్చేవి. పన్నుల విధింపు సంబంధిత ఇన్‌కం టాక్స్ (నెంబరు 2) ,పన్నుల విధింపునకు సంబంధించిన టాక్సేషన్ లాస్ (సవరణ) బిల్లు ఇప్పుడు సభామోదం దక్కించుకున్నాయి. సోమవారం ఉదయం సభ ఆరంభం కాగానే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రెండు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. దేశంలో అమలులో ఉన్న ఆదాయపు పన్ను బిల్లు 1961 నాటి ఆదాయ పన్ను చట్టం నిబంధనలకు అనుగుణంగా ఉంది. ఈ చట్టాన్ని సవరించి , సరైన విధంగా పటిష్టం చేసేందుకు ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లు తీసుకువచ్చారు.ఈ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందితే పాత చట్టం స్థానంలో కొత్త చట్టం అమలులోకి వస్తుంది. ఆదాయపు పన్ను చట్టం అంశాలను పరిశీలించేందుకు బిజెపి సీనియర్ ఎంపి బైజ్యనాథ్ పాండా సారధ్యంలో ఏర్పాటు- అయిన సెలెక్ట్ కమిటీ- సిఫార్సులను ఈ బిల్లులో పొందుపర్చారు. ఇక పన్నుల విధింపు సంబంధిత బిల్లు పన్నుల వ్యవస్థీకృత పద్ధతులలో మార్పునకు ఉద్దేశించింది. ఈ క్రమంలో ఈ ఏడాది తీసుకువచ్చిన ఫైనాన్స్ యాక్ట్‌ను కూడా సవరించడం జరుగుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఐటి బిల్లు 2025లో పలు మార్పులు చేర్పులను సెలెక్ట్ కమిటీ- సిఫార్సు చేసింది. ఇవి కూడా ఇప్పటి తాజా బిల్లులో చేరాయి. బీహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్‌పై ప్రతిపక్షాలు సభలో తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాల దశలో గందరగోళం ఏర్పడిన దశలోనే ఈ రెండు బిల్లులు ఆమోదం పొందినట్లు- సభాధ్యక్ష స్థానం నుంచి ప్రకటన వెలువడింది. ప్రతిపక్షాల ప్రాతినిధ్యం అంతకు ముందటి చర్చ పక్రియ లేకుండానే ఈ బిల్లు ఆమోదం పొందింది.క్రీడా విధానానికి సంబంధించిన అత్యంత కీలకమైన నేషనల్ స్పోర్ట్ గవర్నెన్ బిల్లును , నేషనల్ యాంటీ- డోపింగ్ సవరణ బిల్లును సోమవారం లోక్‌సభ ఆమోదించింది. సర్‌పై ప్రతిపక్షాల తీవ్ర నిరసనల నడుమనే ఈ బిల్లులు సభా సమ్మతి దక్కించుకుంది. స్వాతంత్యం÷-ర వచ్చిన తరువాత దేశంలో క్రీడా విధాన సంస్కరణల దిశలో తీసుకువచ్చిన బిల్లు ఇదే అని క్రీడల మంత్రి మనసుఖ్ మాండవీయ తెలిపారు. క్రీడా రంగంలో ఏకైక సంస్కరణల అడుగు అని స్పందించారు. ఈ రెండు క్రీడా బిల్లులతో జవాబుదారి , సరైన న్యాయం, సుపరిపాలనకు వీలేర్పడుతుంది. క్రీడా సమాఖ్యలు సముచితంగా వ్యవహరించేందుకు వీలేర్పడుతుందని మంత్రి తెలిపారు. బిల్లులు సభలో ప్రవేశపెట్టిన సమయంలో సభలో ప్రతిపక్ష నాయకులు ఎవరూ లేరు. దేశ క్రీడా యవనికలో గణనీయ పరిణామానికి దారితీసే ఈ బిల్లుల దశలో ప్రతిపక్షాలు సభలో లేకపోవడం దురదృష్టకరం అని మంత్రి వ్యాఖ్యానించారు.



# కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికే ముఖ్యం

వేస్తామని చెప్పామని.. అన్నట్లుగానే వేశామని గుర్తుచేశారు. సోమవారంమంత్రి శ్రీధర్ బాబు కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ధర్నాకు బీజేపీ ఎంపీలు ఎందుకు మద్దతు పలకలేదని ప్రశ్నించారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే జనం నమ్ముతారా అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఎవరినీ పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని వెల్లడించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తుది నిర్ణయం స్పీకర్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు బీసీ బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్షకు బీజేపీ ఎందుకు మద్దతు తెలపలేదు..? ఆ పార్టీ ఎంపీలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. అలాంటిది ఈరోజు బీసీల గురించి ప్రతిపక్షాలు మాట్లాడితే నమ్ముతారా అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతోనే ముందుకు పోతామని స్పష్టం చేశారు.

# సిఎం రేవంత్ రెడ్డికి ఊరట

ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ- కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# 14న కరీంనగర్‌లో బిసి కదనభేరి

ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడారు. మంత్రి తలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ..అధికారంలోకి వస్తే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని, ఏటా రూ.20 వేల కోట్లు- కేటాయిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు కేవలం ఓ తీర్మానం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. కుల గణన, 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై లోక్‌సభ ఎన్నికలకు ముందు హడావిడి చేసి ఇప్పుడు ఏమీ చేయడం లేదని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి బిసిల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహించవద్దని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎంఎల్ఎ గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇప్పుడు మోసపూరిత నాటకాలు ఆడుతోందని విమర్శిం చారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో ప్రధానిని, రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించారా? అని ప్రశ్నించారు .వంద మంది ఎంపిలు ఉన్న కాంగ్రెస్ పార్లమెంట్‌లో ఈ అంశంపై ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. బిసిలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించింది, ఆర్‌టిసి ఛైర్మన్‌గా, హైదరాబాద్ మేయర్‌గా బిసిలకే అవకాశం ఇచ్చింది కెసిఆర్ అని గుర్తుచేశారు. మంత్రులుగా కూడా బిసిలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చింది గత ప్రభుత్వమేనని చెప్పారు. శాసనమండలిలో పక్ష నేత మధుసూదనచారి మాట్లాడుతూ.. బిసిల గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ఓ చేర్చడమే ఏ-కై-క మార్గమని చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివా స్ గౌడ్ మాట్లాడుతూ..42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి బిసిల సంఖ్యను తక్కువగా చూపారని విమ ర్శించారు. కేంద్రానికి పంపిన ఆర్డినెన్స్ ముసాయిదాలో రాజకీయ రిజర్వేషన్ల అంశం మా త్రమే ఉందని, విద్య, వైద్యం వంటి ఇతర రంగాలను కావాలనే విస్మరించారని ఆరోపించారు. సమావేశంలోఎంఎల్‌సిలు బండ ప్రకాష్, ఎల్. రమణ, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ భాస్కర్, బిసి కమిషన్ మాజీ వకులాభరణం కష్ణమోహన్, జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్లు తుల ఉమ, కనుమల్ల విజయ, దావ వసంత, మాజీ ఎంఎల్‌లు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఒడితెల సతీష్ బాబు, విద్యాసాగర్ రావు, కోరుకంటి చందర్, మాజీ ఎంఎల్‌సి నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు బండ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కరీంనరగర్ జిల్లా కేంద్రంలోని బిసి కదనభేరి సభ స్థలమైన మహాత్మాజ్యోతిబాపులే మైదానాన్ని నేతలు పరిశీలించారు.

# సమస్యల పరిష్కారంలో పట్టువిడుపులు ఉండాలి

ఈ విషయంపై సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. పని చేస్తూనే తమ డిమాండ్లను నెరవేర్చుకోవాలి కానీ, షూటింగ్‌లను నిలిపివేయడం సరైనది కాదని ఆయన అన్నారు. సోమవారం ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు, నిర్మాత, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజుతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో నిర్మాతలు సుప్రియ, జెమిని కిరణ్, దామోదర్ ప్రసాద్ ఉన్నారు. పరిశ్రమలో నెలకొన్న తాజా పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎస్ఎల్బీసీ టన్నెల్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం తన మీద కోపం ఎస్ఎల్‌బిసి మీద చూపిస్తుందని ఆరోపించారు. ఇది కూలిపోవాలని కేసీఆర్ ఫామ్ హౌజ్‌లో క్షుద్ర పూజలు చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 43 కిలోమీటర్లు ఉన్న ఈ టన్నెల్ ఓ అద్భుతమని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ కట్టిన కాళేశ్వరం అసలు అద్భుతమే కాదని విమర్శించారు. కాళేశ్వరం నివేదిక రావడంతో.. బీఆర్ఎస్ నాయకులు నోళ్లు మెదపడం లేదని పేర్కొన్నారు. నివేదికతో బీఆర్ఎస్ బాగోతం బట్టబయలైందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిందని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టడానికి బీఆర్ఎస్ నాయకులు కల్లిబొల్లి మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌పై నమ్మకంతోనే ప్రజలు ఎన్నికల్లో గెలిపించారని స్పష్టం చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంత్రి వివరించారు.

# 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతం

బిహార్‌లో ఓట్ల జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఈ ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయల్దేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ సహా దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు పాల్గొన్నారు. అయితే.. ఈ ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ రహదారిని బ్లాక్ చేసి బారికేడ్లు పెట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని నిలువరించారు. విపక్ష ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టింది. విపక్ష ఎంపీలంతా ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యతిరేక నినాదాలు చేశారు. అయితే అనుమతి లేదంటూ బారికేడ్లు దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో మహిళా ఎంపీలు, అఖిలేష్ యాదవ్ బారికేడ్లు దూకే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఆశ్చర్యంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉండే శశిథరూర్ అనూహ్యంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు, బిహార్ సమగ్ర సవరణ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఈసీకి లేఖ రాశారు. ఇందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం.. విపక్షాలతో భేటీకి అంగీకరించింది

# సింగరేణి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ

# సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ




ఖైరతాబాద్. (ది క్రైమ్ న్యూస్): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో స్వర్గీయ మాజీ భారత ప్రధాని రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం చెక్కుల పంపిణీ జరిగింది. ఈ మేరకు సింగరేణి సంస్థ అధికార వర్గాలు విడుదల చేసిన ప్రకటనలోనీ వివరాల ప్రకారం.. ఉదయం సింగరేణి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నుండి సివిల్స్ మెయిన్స్ కు ఎంపికైన 180 మంది అభ్యర్థులకు, అభయహస్తం చెక్కులు అందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా హాజరై, రాష్ట్రం నుండి మెయిన్స్ కు ఎంపికైన 180 మంది అభ్యర్థులకు ఒక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సింగరేణి నుండి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలని, అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, మెయిన్స్ కు ఎంపికైన 180 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అందించడం జరుగుతుందని, అలాగే ఇంటర్వ్యూ కి ఎంపికైన వారికి కూడా, లక్ష రూపాయల ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పించడం జరుగుతుందనీ భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం, చరిత్రలో నిలిచిపోయే సివిల్స్ అధికారులుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. మానవ వనరులు అతి ముఖ్యమైనవి, అవి బలమైన పెట్టుబడులని, ఆ మానవ వనరులను సానబట్టి వజ్రాలుగా తయారు చేస్తే సమాజానికి ఎంతగానో ఉపయోగపడతారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేసి సివిల్స్ కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో కొంత సాయం చేస్తే వారు లక్ష్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అభ్యర్థులకు మనో ధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా, పదిమంది సివిల్ సర్వీసెస్ కి ఎంపికయ్యారని ఆయన వివరించారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం, ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుందనీ, వేలాది మంది రాష్ట్రంలో పనిచేసినా ఎస్.ఆర్. శంకరన్, పార్థసారథి, మాధవరావు వంటి కొద్ది మంది పేర్లు మాత్రమే జనం గుండెల్లో నిలిచిపోయాయన్నారు. నిబద్ధతతో సేవలందిస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ప్రభుత్వాలు ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా, ఫలితం ఉండదన్నారు. ఎస్.ఆర్. శంకరన్ సాంఘిక సంక్షేమ శాఖలో సెక్రటరీగా ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి ఉపయోగపడ్డాయి అన్నారు. 45 వేలకు పైబడి ఉన్న సింగరేణి కార్మికులు సింగరేణి సంస్థను బతికిస్తూ, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారనీ, మీ ప్రయత్నంలో విజయం సాధించే క్రమంలో, సింగరేణి కార్మికుల ఆశీస్సులు మీకు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని, వీటిలో స్కిల్ డెవలప్మెంట్, యూనివర్సిటీ వంటివి ఉన్నాయని, రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్ కు ఎంపికైతే రాష్ట్రానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం గొప్ప ఆశయంతో జరుపుతున్నామని, ఈ పథకం సహాయంతో సివిల్స్ లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరామ్ మాట్లాడుతూ.. పేద ఇంటి పిల్లలు కూడా సివిల్స్ లో విజయం సాధించాలనే ఉద్దేశంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ల మార్గనిర్దేశంలో ఈ వినూత్న కార్యక్రమానికి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టిందన్నారు. సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల గురించి ఆలోచించకుండా, లక్ష్య సాధన పైనే పూర్తి దృష్టి సారించడం కొరకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించి, లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందుకోవటం ఆనందదాయకంగా ఉందన్నారు. అనంతరం 2024లో తెలంగాణ ప్రాంతం నుండి సివిల్స్ విజేతలైన 30 మందికి ఈ సందర్భంగా మెమెంటోలను బహూకరించారు. వీరిలో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద లబ్ధి పొందిన అభ్యర్థుల్లో వరంగల్ కు చెందిన ఎట్టబోయిన సాయి శివాని సివిల్స్ లో 11వ ర్యాంక్ సాధించడంపై ముఖ్య అతిథులు అభినందించారు. అలాగే ఫారెస్ట్ సర్వీసెస్ కి ఎంపికైన నలుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఇద్దరికి కూడా ఈ సందర్భంగా జ్ఞాపికలను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మాక్ ఇంటర్వ్యూల ద్వారా లబ్ధి పొందిన కర్ణాటక నుంచి ఒక్కరు, మహారాష్ట్ర నుంచి ఒకరికి జ్ఞాపికలను అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కనీస వేతనాల కమిటీ ఛైర్మన్ జనక్ ప్రసాద్, సింగరేణి సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు, ఎల్వీ సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, గౌతమ్ పొట్రు, జీఎం (కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, సింగరేణి అధికారుల సంఘం నాయకులు లక్ష్మీపతి గౌడ్, నరసింహ పాల్గొన్నారు.

## వికలాంగుల క్రీడల విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన

**విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే కృష్ణారావు.**



కూకట్పల్లి ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్): పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగుల క్రీడల విభాగంలో కూకట్పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారిని అభినందించారు. ఇందులో రన్నింగ్ లో పవన్ కళ్యాణ్ సిల్వర్ మెడల్, ప్రేమ్ కుమార్ కాంస్య పథకం, అలాగే టి.37 విభాగంలో సురేందర్ కాంస్య పథకం, టి.20 విభాగంలో కె.ఆశిష్ కాంస్య పథకం సాధించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ వికలాంగుల అయినప్పటికీ మనోధైర్యంతో ముందుకెళ్లి అత్యుత్తమ ప్రదర్శన కనబరచడం ఆనందించదగ్గ విషయమని, తల్లిదండ్రులు కూడా క్రీడల విభాగంలో పిల్లల్ని ప్రోత్సహిస్తే దేశానికి మంచి పేరు తీసుకువస్తారని, క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు వారి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ఇప్పటికే కూకట్పల్లి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లో క్రీడలకు సంబంధించి షటిల్ కోర్టులు, ఇండోర్ స్టేడియంలు ఏర్పాట్లు చేశామని వీటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

## జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం.



ముత్తారం.ఆగష్టు.11.(ది క్రైమ్ న్యూస్):ముత్తారం మండలంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ,ప్రైవేటు,అంగన్వాడి పాఠశాలల్లో,కళాశాలల్లో 1 నుండి 19 సంవత్సరాల పిల్లలకి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.దీనిలో భాగంగా పిల్లలకి నులి పురుగులు అంటే పేగు పురుగులు అని ఇది మానవ పేగులలో జీవించే పరాన్న జీవులు అని పిల్లలలో ఎక్కువగా ఉంటాయని అన్నారు. వీటి గల కారణాలు పాదరక్షలు లేకుండా బయట తిరగడం,బహిరంగ మలమూత్ర విసర్జన,పరిశుభ్రత పాటించకపోవడం వలన ఇన్ఫెక్షన్ సోకిన వ్యాప్తి చెందుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంహెల్ హెచ్పిలు దీప్తి,లావణ్య,పబ్లిక్ హెల్త్ నర్స్, ఆశాలు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట ఎక్సైజ్ సీఐపై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు..



జమ్మికుంట ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట ఎక్సైజ్ సీఐ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు పిడిఎస్యు జిల్లా కమిటీ అధ్యక్షులు అంగిడి కుమార్ వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సిపిఐ( ఎంఎల్) మాస్ లైన్ ( ప్రజా పంథా) పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట, ఇల్లంతకుంట , వీణవంక మండలాలలో ఉన్న వైన్ షాప్ లో నుండి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్న వైన్ షాప్ లు లైసెన్స్ రద్దు చేయాలని బెల్ట్ షాపుల పైన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎక్సైజ్ సిఐ కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని, బిర్యాని సెంటర్లలో , ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో, హెూటల్లో , కిరాణా షాప్ లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్న గ్రామాలలో ఉన్న బెల్టు షాపులలో ఏరులై పారుతున్న మద్యం పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న వైన్ షాపుల లైసెన్సులు రద్దు చేసి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధించిన ఎక్సైజ్ అధికారాలు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పైన శాఖ పరమైన చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ధీరజ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓ(పో)రుగల్లులో ఉద్యమకారుల మహాపాదయాత్ర.

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.**

**యాత్రలో పాల్గొన్న పెద్దపల్లి జిల్లా ఉద్యమ నాయకులు.**

ది క్రైమ్ న్యూస్ బ్యూరో : ఈరోజు వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమకారులు సాగిస్తున్న మహా పాదయాత్ర లో పెద్దపల్లి జిల్లా ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలంటూ తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ మహాపాదయాత్ర సాగుతున్నదంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఉద్యమకారుల ఫోరం నాయకుడు గుండేటి ఐలయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్, రాష్ట్ర కార్యదర్శి చర్లపల్లి సురేష్ గౌడ్, స్టేట్ జర్నలిస్టుల ఫోరం నుండి కందుల అశోక్ పటేల్, పెండెం చేరాలు, గట్టు సమ్మయ్య, బింగి రాజు, తోట రాములు, కట్ల ప్రతాప్, మంగ రవీందర్, తీట్ల మల్లేష్, ఉయ్యాల ఓదెలు, గోపి, సతీష్, రాజీరు గౌడ్, సిరికొండ కొమురయ్య, ఉమ్మల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.




## పాక్ ఆర్మీచీఫ్ అణు ప్రేలాపనలు

ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధా లపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర మూకలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతూనే ఉంటారు. పాక్‌లోప్రజాస్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రిస్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు– ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఎ÷–లోరిడాలో ఓ కార్యక్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసు కున్నారు. తమది అణ్వాయుధ సామర్థం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో న్యూదిల్లీ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. తమతో పాటు– సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ ప్రేలాపనలు చేశారు. కాగా.. మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ మునీర్ అగ్రరాజ్యంలో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే తమతో పాటు సగం ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తామంటూ తన అధికారిక పర్యటనలో ప్రకటించటం ప్రకంపనలు సృష్టిస్తోంది. విచక్షణ లేకుండా నోటికి వచ్చినట్లు– వ్యాఖ్యలు చేయటం ప్రపంచ భద్రతకు ముప్పని మునీర్ వ్యాఖ్యలను మాజీ భారత ఆర్మీ మేజర్ జనరల్ జిడి బక్షి ఖండించారు . పిచ్చెక్కిన మునీర్ అణుదాడి చేస్తామంటూ బెదిరించటాన్ని బక్షి కొట్టిపడేశారు. అలాగే సింధు నదిపై నిర్మించే డ్యామ్ మిసైళ్లతో కూల్చేస్తామంటూ డప్పాలు బాదటం ఆయనను మరోసారి నవ్వులపాలు చేస్తోంది. ఇటీవల మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ మిస్సైళ్లను భారత భద్రతా వ్యవస్థలు కూల్చేసిన విషయాన్ని మునీర్ మర్చిపోయారని అన్నారు బక్షి. సిందూర్ సమయంలో పాక్ మూడు బ్యాలెస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించగా 100 శాతం వాటిని భారత్ అడ్డుకుందని అన్నారు. అలాగే పాక్ పంపిన వెయ్యి డ్రోన్లలో 90 శాతం నిరోధించబడ్డాయని బక్షి చెప్పారు. 3వ అణు యుగంలో ఇంటిగ్రే–టె–డ్ ఆఉ వ్యవస్థల పూర్తి సామర్థం పాకిస్తాన్ వంటి చిన్న దేశాలు కలిగి ఉన్న అణ్వాయుధ స్థావరాలను మట్టికరిపిస్తాయని అన్నారు బక్షి. ఈ పిచ్చి ముల్లా సగం ప్రపంచాన్ని తనతో తీసుకెళ్లకుండా అమెరికా నిరోధించాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ జనరల్ బక్షి పిలుపునిచ్చారు. మునీర్ ప్రసంగం కాశ్మీర్ పై పెరుగుతున్న శత్రుత్వానికి అద్దం పడుతోంది. ఇంత నిర్లక్ష్యంగా ఒక దేశ ఆర్మీ చీఫ్ మాట్లాడటాన్ని భారత్ కూడా ఖండిస్తోంది. విదేశాలను బెదిరించటానికి పాక్ ఎప్పుడు పాత న్యూక్లియర్ దాడి పాడటాన్ని ప్రపంచ నేతలు కూడా తప్పుపడుతున్నారు. ఇదంతా చూస్తుంటే మునీర్ అమెరికా పర్యటనను మీడియా కవరేజ్ కోసం కారుకూతలు కూస్తున్నాడా అనే అనుమానాలను కూడా కొందరు సోషల్ మీడియాలో పంచుకుంటు–న్నారు.

## పోడు భూములకు ప్రభుత్వం హక్కులు కల్పించాలి

**బిజెపి మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి**



తిమ్మాపూర్, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో పోడుభూములకు హక్కులు కల్పించాలని చలో హైదరాబాద్ పేరుతో ఈనె6న పాదయాత్ర చేపట్టిన కొమురం భీం జిల్లా చింతమానేపల్లి మండలం దిండా గ్రామస్తులకు బిజెపి మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి ఆదివారం రాత్రి బసను ఏర్పాటు చేయించారు.దిండా గ్రామస్తులు మాట్లాడుతూ.... నలభై ఏళ్లుగా వ్యవసాయంపైనే ఆదారపడి జీవిస్తున్న బిసి కులస్తులైన తమకు గ్రామంలో పోడు భూముల సాగుపై అధికారులతో ఎదురౌతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆవేదన చెందారు. మృగాలకు ఇచ్చే ప్రాముఖ్యత మనుషులకు ఇవ్వకపోవడంతోనే హైదరాబాద్ వరకు పాదయాత్రకు సిద్ధమయ్యామని,వర్షంలో తడుస్తూ,ఎండకు ఎండుతూ కాళ్ళకు బొబ్బలు వస్తున్నా పాదయాత్రపై వెనుకడుగు వేయబోయమని పేర్కొన్నారు.బాధితులకు బీజేపీ నాయకులు,ఆవుల వేణు యాదవ్, కోతి రాజు,ఎడ్ల భూరెడ్డి,వేల్పుల ఓదయ్య,దుర్గంటి శేఖర్ రెడ్డి,సిద్ధ శ్రీనివాస్,ఆవుల మల్లేశం,బోళ్ల శంకర్ తో పాటుగా గ్రామస్తులు సంఘీభావం ప్రకటించారు.తాత ముత్తాతల నుండి సాగు చేసుకుంటున్న భూములకు హక్కుల కోసం న్యాయపరంగా చేస్తున్న పాదయాత్రపై ప్రభుత్వం వెంటనే స్పందించి భూములకు హక్కులు కల్పించేలా చర్యలు తీసుకుని పాదయాత్ర సంకల్పం నెరవేర్చాలని కోరుకుంటున్నట్లు బిజెపి మండలాధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వర చారి తెలిపారు.పాదయాత్ర చేస్తున్న 45మందికి బస,బోజన వసతి ఏర్పాట్లపై సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ సుగుర్తి జగదీశ్వరాచారికి చరవాణి ద్వారా ధన్యవాదాలు తెలిపారని బాదిత దిండి గ్రామస్తులు తెలిపారు.

## తొర్రూర్ జమా మసీద్ నూతన కమిటీ ఎన్నిక



తొర్రూరు, ది క్రైమ్ న్యూస్ : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో సోమవారం స్థానిక జమా మస్జిద్ నూతన కమిటీని పట్టణ కేంద్రానికి చెందిన ముస్లింల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ అలీమ్, ఉపాధ్యక్షులుగాబీ ఎండి మౌలానా పాషా,ఎండి షబ్బీర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అమీర్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ యాకూబ్ పాషా, కోశాధికారిగా గౌస్ మొహినోద్దీన్, సహాయ కోశాధికారిగా,చాంద్ పాషా, కమిటీ మెంబర్స్ ఎండి అబ్దుల్ గని ఎండి అమినుల్ ఇస్లాం ఎండి ఎజాజ్ ఎండి యాకూబ్ ఎండి ఇమ్రాన్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అలీం, ప్రధాన కార్యదర్శి అమీర్, కోశాధికారి గౌస్ మోహినోద్దిన్ ల్లు సంయుక్తంగా మాట్లాడుతూ కమిటీ ఎన్నికకు సహకరించిన మాతోటి ముస్లిం సోదరులందరికీ పేరు– పేరునా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని తెలుపుతూ మాపై నమ్మకంతో ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ మస్జిద్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.రామగిరి మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన ఆవునూరి పద్మ తమ ఇండ్లు శిథిలావస్థలో ఉందని తమకు ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ విచారణ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త రామన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయని వీటిని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు .పాలకుర్తి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన రామ్మోహన్ రావు సర్వే నెంబర్ 503 లోని ప్రభుత్వ భూమిలో పంపు కట్టారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవో కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ఎన్నికల సంస్కరణలే శరణ్యం!

దేశంలో ఎన్నికల సంస్కరణలకు ఇదే సమయం. దీనిపై ప్రస్తుత సమావేశాల్లో దీనిపై చర్చ జరగాలి. అవసరమైతే రాజ్యంగ సవరణ జరగాలి. ఒక్క దొంగ ఓట్ల గురించే చర్చ కాదు..అనేక విషయాలపై చర్చ జరగాలి. ఏకపక్షంగా కొందరే దేశాన్ని పాలించే దౌర్భాగ్య వ్యవస్థ నుంచి భారత్ బయటపడాలి. ఇందుకోసం అవసరమైన చర్చ జరగాలి. సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ప్రధానంగా కొందరే పార్లమెంట్‌కు వరుసగా ఎన్నికయ్యే దుర్విధానం పోవాలి. అలాగే ఒక్కరు రెండుసార్ల కటే ఎక్కువగా పార్లమెంట్, అసెంబ్లీలకు ఎన్నిక కాకుండా కఠిన నిబంధనలు విధించాలి. ప్రధాని, మంత్రులుగా రెండు పర్యాయాలకంటే ఎక్కువ ఉండకుండా నిబంధనలు విధించుకోవాలి. శాసనమండళ్లతో పెద్దగా లాభం లేదు. దీనిపై చర్చ జరగాలి. వీటిని రద్దు చేసుకోవడం మంచిది. రాజకీయ వ్యవస్థల కారణంగా ప్రజలు పన్నులతో కడుతున్న డబ్బులు దుబారా అవుతున్నాయి. రాజకీయ నేతల విలాసాలకు డబ్బులు వృధా చేస్తున్నారు. అలాగే ఎంపిలు, ఎమ్మెల్యేలకు జీతభత్యాలు, పెన్షన్లు తొలగించాలి. ఒక్కొక్కరు రెండు పెన్షన్లు పొందడాన్ని తక్షణమే రద్దు చేయాలి. ఎంపిటిసిలు, జడ్పిటిసిల వ్యవస్థను రద్దు చేయాలి. వీటితో పాటు గవర్నర్ వ్యవస్థను కూడా రద్దు చేయాలి. ఇకపోతే ప్రతస్తు బీహార్ ఓట్ల సవసరణపై విపక్షాలు రచ్చ చేస్తున్నాయి. దీంతో సభాసమయం వృధా అవుతోంది. వీటికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశంపై ఏదో ఒక రూపంలో చర్చకు అవకాశం ఉంది. అలా కాకుండా సభలో లొల్లి చేసి గందరగోళం సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలి. ఇకపోతే ఓట్ల నమోదు అన్నది శాస్త్రీతయంగా ఉండాలి. ఆధార్ తరహాలో పర్మినెంట్ కార్డు నంబర్ కేటాయించేలా చర్యలు తీసుకోవాలి. ఆధార తరహాలో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉండాలి. అడ్రస్ మార్చాలనుకున్నా సులువుగా ఆన్‌లైన్‌లో చేసుకునేలా ఉండాలి. ఓటర్లు ఎక్కడికైనా మార్పు చేసుకునే వీలుండాలి. అలాగే చనిపోయిన వారి వివరాలు గ్రామస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు నమోదు చేసి, తొలంగించే వెసలు బాటు కలిగి ఉండాలి. లేదా ఇసికి సమాచారం ఇవ్వగలగాలి. నిజానికి ఇవన్నీ ప్రధాన సమస్యలు ఉండగా కేవలం బీహార్‌లో ఓటర్ల నవీకరణపైనే కేవలం ఆందోళన చెందడం సరికాదు. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభల్లో గత పక్షం రోజులగా బీహార్ ఓటర్ల నమోదుపై ఆందోళన కారణంగా పార్లమెంట్ ఉభయ సభలు పెద్దగా కార్యకలాపాలు సాగించలేక పోతున్నాయి. దేశంలోని 4,130కుపైగా ఉన్న అసెంబ్లీ స్థానాల్లో కర్నాటకలోని ఒక్క మహదేవపుర అసెంబ్లీ స్థానంలో చోటు చేసుకున్న ఓటర్ల జాబితా అక్రమాలను చూసిన తర్వాత..మన ఓటరు జాబితాలు తప్పుల తడకలా? లేక దొంగ ఓటర్ల పనా అన్న అనుమానాలు వచ్చి నప్పుడు పారదర్శకంగా పరిశీలించుకునే అవకాశం ఇవ్వాలి. నిజంగానే దొంగ ఓట్లు, దొంగఓట్లు వేయడం వంటివన్నీ అరికట్టాలి. ఇదంతా పటిష్ట వ్యవస్తతో మాత్రమే సాధ్యం. అవన్నీ దొంగ ఓట్లే అని ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై విచారణ జరపడంలో సందేహం ఉండాల్సిన పనిలేదు. ప్రభుత్వంతో పాటు ఎన్నికల వ్యవస్థను పర్యవేక్షిస్తున్న రాజ్యాంగబద్ధసంస్థ ఎన్నికల సంఘం కూడా ఇలాంటి వాటికిఓ జవాబుదారీగా ఉండాలి. అయితే ఇప్పుడున్న వ్యవస్థలో దొంగోట్ల నమోదు, దంగ ఓట్లు వేయించు కోవడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయి. ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఓటర్ నమోదు ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. అలాకాకుండా దొంగ పేర్లు, దొంగ ఓట్లు నమోదు చేయడం వంటివన్నీ చూస్తున్నాం. పోలింగ్ బూతుల ఆక్రమణ, రిగ్గింగ్ వంటి దుర్మార్గాలను చూస్తున్నాం. ఇవన్నీ పోవాలంటే సమగ్ర చట్టాలు రావాలి. అందుకే సమగ్ర ఎన్నికల వ్యవస్థ లేకుండా ఇప్పుడున్న రీతిలో ముందుకు సాగలేం. దొంగ ఓట్లను నమోదు చేయించడం, వేయించడం అన్నది రాజకీయ పార్టీలు అవలంబిస్తూ వస్తున్న దుర్మార్గపు చర్యలగానే చూడాలి. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకున్న రాజకీయ పార్టీలు ప్రజలు వెర్రిబాగులను చేసి అధికారం చెలాయిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఎన్నికల నిర్వహణలో ఉన్న సర్వ స్వతంత్రత కలిగిన సంస్థగా ఎంత బలమైనదో టీఎన్ శేషన్ వంటి అధికారులు నిరూపించారు. 1951 మొదటి ఎన్నికల నుంచి ఇప్పటివరకూ ఎన్నో సంస్కరణలు జరిగాయి. 1989లో ఓటు హక్కును 18 ఏండ్లు నిండినవారికి ఇవ్వడం మొదలు 1990లో ఓటరు గుర్తింపు కార్డుల పరిచయం, 2009లో ఈవీఎం మిషన్ల ప్రవేశం, 2019లో వీవీ స్లిప్పులు వంటివి జరిగాయి. చీఫ్ ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లను ప్రధాని, ప్రతిపక్షనేత, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాతో కూడిన కమిటీ ఎన్నుకునేది. కానీ, మోదీ ప్రభుత్వం 2023లో సీజేఐ స్థానంలో కేబినెట్ మంత్రిని తీసుకొచ్చింది. అయితే ఇవన్నీ పోయి పార్దర్శక విధానాం రావాలంటే మన వ్యవస్థలో ఉన్న లోపాలను సంస్కరించాలి. ఇప్పుడు దొంగ ఓట్ల ఆరోపణలు చేస్తున్నవారే ఎన్నికల సంస్కరణ గురించి మాట్లాడడం లేదు. నకిలీ చిరునామాలతో, ఫొటోలతో, ఆధార్‌తో ఓటుహక్కును ఎలా పొందగలుగుతున్నారన్నదే ప్రశ్న. దీనికి రాజకీయ పార్టీలే సమాధానం చెప్పాలి. ఇలా ఓటర్ల జాబితాలన్నీ తప్పులతడకలుగా మారితే, ప్రజాతీర్పులకు ఉన్న విలువేమిటి అనే నైతిక ప్రశ్న ఉదయిస్తోంది. జవాబుదారీగా ఉండాల్సింది మన ఎన్నికల సంఘమే కాబట్టి, వారు స్వతంత్రంగా పనిచేసేలా చట్టాలను పక్కాగా రూపొందించాలి. సమగ్ర ఎన్నికల సంఘాన్ని నియిమించడంతో పాటు, సంస్కరణలు చేపడితే తప్ప దేశంలో ప్రజాస్వామ్యం అన్నది మనుగడ సాగించలేదు.

# జగదీప్ ధన్‌ఖడ్ ఆచూకీ తెలపండి



**ఆయన ఆరోగ్యంపై మాకు ఆందోళనగా ఉంది**

**ఆయనతో మాట్లాడాలని అనుకున్నా సాధ్యం కాలేదు**

**హోంమంత్రి అమిత్ షాకు శివసేన ఎంపి సంజయ్ రౌత్ లేఖ**

న్యూఢిల్లీ,ఆగస్ట్11 : రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడం ఆచూకీ చెప్పాలంటూ శివసేన నేత సంజయ్రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఆయనతో సంప్రిందించాలని చూసినా ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- ఆయన చెప్పినప్పటికీ.. దీనిపై విపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ తాజాగా శివసేన (యూబీటీ-) సీనియర్ నేత సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము ఫోన్‌లో కూడా కలవ లేకపోతున్నామని, ఆయన ఎక్కడున్నారో చెప్పాలని కోరారు. మన మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారన్న దానిపై ఎలాంటి సమాచారం లేదు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలపై స్పష్టత రావట్లేదు. ధన్‌ఖడ్‌తో మాట్లాడేందుకు కొంతమంది రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఆయనను, ఆయన సిబ్బందిని సంప్రదించలేకపోతున్నాం. ఇది చాలా ఆందోళనకరం. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా? ఈ ప్రశ్నలపై దేశ ప్రజలకు సమాధానం కావాలని సంజయ్ రౌత్ తన లేఖలో ప్రశ్నించారు. ఈ లెటర్‌ను సంజయ్ రౌత్ ఆదివారం పంపించగా.. సోమవారం ఎక్స్ ఖాతాలో దీని గురించి పోస్ట్ చేశారు. ధన్‌ఖడ్ ఎక్కడున్నారో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాలని అనుకుంటున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించారు. సుప్రీంకోర్టుకు వెళ్లేముందు దీనిపై మీ నుంచి సమాచారం కోరడం ఉత్తమమని భావించాం. మా ఆందోళనలను అర్థం చేసుకుని మాజీ ఉపరాష్ట్రపతి ఆచూకీ చెబుతారని విశ్వసిస్తున్నాం అని శివసేన ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. గతవారం పలువురు విపక్ష నేతలు కూడా ధన్‌ఖడ్ సమాచారం కోసం కేంద్రాన్ని ప్రశ్నించారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు- తెలిపారు.

# వాతావరణ శాఖ హెచ్చరికలు

**అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత**



అమరావతి,ఆగస్ట్11 : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ... సోమవారం ఉదయం జిల్లాల కలెక్టర్లు, విపత్తు నిర్వహణశాఖ అధికారులతో హోం మంత్రి అనిత సమావేశం నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యం గా ప్రమాదకర హాట్‌స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు- చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. తాజా పరిస్థితులపై తనకు ఎప్పటికప్పుడు నివేదించాలని అధికారులను మంత్రి అనిత కోరారు. అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ఎక్కువగా నష్టం జరగనున్న ప్రాంతాలను ముందే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

## రాష్ట్రానికి భారీ వర్ష సూచన

**పిడుగులతో కూడిన వర్షం పడే ఛాన్స్**

అమరావతి : ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ కారణంగా సోమవారం, మంగళవారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పిడుగులతో పాటు- తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు- అధికారులు తెలిపారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పాత హోర్డింగ్స్, విద్యుత్ స్తంభాల దగ్గర ప్రజలెవ్వరూ నిలబడకూడదని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్న కారణంగా రైతులు పొలాల్లో పనులు చేసే సమయంలో, పశువులను మేపే వేళలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. తాజా వాతావరణ అంచనాల ప్రకారం ... బుధవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో దక్షిణ కోస్తాంధ్రలో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- సూచించింది. అల్పపీడనం బలపడితే గాలుల వేగం పెరిగి, సముద్రం ఆందోళనకర స్థితిలోకి మారవచ్చని హెచ్చరిక జారీ చేసింది. ఈ నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సలహా ఇచ్చింది. ఈ వర్షాల ప్రభావం ముఖ్యంగా నెల్లూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, బాపట్ల, తెనాలి, ఒంగోలు, విశాఖపట్టణం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది.మరోవైపు.. నంద్యాల జిల్లాలోని మిడ్తూర్‌లో భారీ వర్షం కురిసింది. ఉధృతంగా వాగు ప్రవహిస్తోంది.

# కృష్ణా పరివాహకంలో భారీ వర్షాలు




## జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు

హైదరాబాద్,ఆగస్ట్11 : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఎ÷-లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు- విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థం 215.80 టీ-ఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. వరద చేరుకోవడంతో పలు ప్రాజెక్టుల గేట్లు- తెరిచారు. నాగార్జునసాగర్, హిమాయత్ సాగర్, శ్రీరాంసాగర్, మూసీ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం జలాశయాల్లో భారీగా వరద ప్రవహిస్తోంది. ఈ జలాశయాల దగ్గర ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా ఉంది. హిమాయత్ సాగర్‌కు వరద నీరు మళ్లీ పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. వరద నీరు పెరగడంతో రెండో గేట్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తారు. ఇప్పటి వరకు ఒక్క గేటు- మాత్రమే అధికారులు తెరిచి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తుండటంతో ప్రమాదకరస్థాయిలో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరుకుంది. హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారాహిల్స్, బుల్కాపూర్, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి వరద వస్తోంది. తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీవహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. తిరిగి క్ష సర్వీస్ రోడ్డును అధికారులు మూసివేశారు. వరద ప్రవాహంతో రాజేంద్రనగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మూసీ పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# నామ స్మరణమే.. శరణం!

ప్రపంచవ్యాప్తంగా భక్తులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. సర్వాకర్షకుడైన శ్రీకృష్ణుడి ఆవిర్భావ లీలనే కృష్ణాష్టమి. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, భగవానుడి దివ్య ఆవిర్భావాన్ని స్మరించుకుంటూ, ఆయన అపార కరుణను అనుభూతి చెందేందుకు ఒక మహత్తర అవకాశం. ఈ పవిత్ర దినం మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపి, భగవంతుడితో మన సనాతన సంబంధాన్ని గుర్తు చేస్తుంది. శ్రీకృష్ణుడి జననం సాధారణ శిశువుల వలె సంభవించినది కాదు. వాస్తవానికి ఆయన పుట్టుక లేనివాడైనప్పటికీ, తన అంతరంగిక శక్తితో ఈ లోకాన అవతరించడం భగవానుడి దివ్య లీలల్లో ఒకటి. దేవాదిదేవుడు, పరబ్రహ్మం, సర్వశక్తిమంతుడైన శ్రీకృష్ణుడు కేవలం ఆయన స్వీయ సంకల్పం మేరకే లోకంలో అవతరిస్తాడు గానీ, భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. మథురలోని కంసుడి కారాగారంలో దేవకీ వసుదేవులకు జన్మించినప్పుడు, శ్రీకృష్ణుడు శంఖ, చక్ర, గదా, పద్మాలతో చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. తల్లి దేవకి ప్రార్థన మేరకు ఒక సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. శ్రీకృష్ణుడు అవతరించిన ఆ శుభ ఘడియలలో లోకమంతా ఆనందం, శాంతి నెలకొని, దిక్కులన్నీ ప్రసన్నమైనట్టు శ్రీమద్భాగవతం చెబుతుంది. అవతార లక్ష్యం.. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించేందుకు తాను యుగయుగాన అవతరిస్తానని శ్రీకృష్ణుడే స్వయంగా ప్రకటించాడు. అంతేగాక, ఆయన జీవితం, లీలలు, బోధనలు మానవాళికి గొప్ప సందేశాన్ని అందిస్తాయి. శ్రీకృష్ణుడు కేవలం ఏడేళ్ల వయసులో తన చిటికెన వేలితో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి, దానిని ఏడు రోజుల పాటు నిలబెట్టాడు. ఇది ఆయన అసాధారణ శక్తిని, మనం ఆయన్ని ఒక సాధారణ మానవుడిగా చూడకూడదని నిరూపిస్తుంది. ఆయన లీలలు ప్రాపంచిక మాలిన్యాలకు అతీతమైనవి. శ్రీకృష్ణుడి జననం, కర్మల దివ్యత్వాన్ని తెలుసుకున్నవారు ఈ భౌతిక ప్రపంచంలోకి తిరిగి రారు, శాశ్వత ధామాన్ని చేరుకుంటారు. మానవ జన్మకు అంతిమ లక్ష్యం భగవంతునితో ప్రేమపూర్వక సంబంధాన్ని పునరుద్ధరించుకోవడమే! భగవద్గీతలో శ్రీకృష్ణుడు మానవాళికి అందించిన పరమ సందేశం 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' (సమస్త ధర్మాలను త్యజించి నన్నే శరణు పొందు). ఇది మోక్షాన్ని పొందే అత్యంత సరళమైన మార్గం.



ఆధ్యాత్మికం

# ఎన్నికల కమిషన్‌కి భాధ్యతలు గుర్తు చేస్తే దేశ ద్రోహులు అవుతామా

## సత్యం శ్రీరంగం.

కూకట్పల్లి ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : దేశంలోని పలు రాష్టాలలో ఎన్నికల సంఘం (ఈసీ) తో కలసి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసే " ఓట్ చోరీ " పోరాటంలో యువత, ప్రజలు భాగస్వామ్యం కావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. ఎన్నికల కమిషన్ నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ " ఓట్ చోరీ " ప్రజా ఉద్యమం కి మద్దతుగా సోమవారం గాంధీ భవన్ లో పత్రికా సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సాక్ష్యాధారాలతో సహా ప్రతిపక్ష నేత చెప్పిన భారత ఎన్నికల సంఘం మాత్రం రాహుల్ గాంధీ పై ఒక రాజకీయపార్టీ లా అనుమానాల్ని వ్యక్తం చేస్తుందన్నారు. సుమోటోగా తీసుకోవాల్సిందిపోయి, లిఖిత పూర్వక ఫిర్యాదుతో పాటు ఆధారాలు సమర్పించమంటుంది అని, ఇక్కడే ఈసీ నిబద్ధత పై దేశ ప్రజల్లో అనుమానాలు కలిగిస్తున్నాయన్నారు. రాహుల్ గాంధీ ప్రెస్ కాన్ఫరెన్స్ లో ఓట్ల దొంగతనానికి ఆధారాలు ఇచ్చారని, అంకెలతో సహా సాక్ష్యాధారాలను జాతిముందుంచారన్నారు. ఆధారాలు ఇవ్వడానికి వేరే మార్గం ఏమిటి? దేశం మొత్తం ఓటర్ల జాబితాను స్కాన్ చేస్తూ, ఎన్నికల కమిషన్ కు ఆధారాలు ఇస్తూ ఉంటే, ఎన్నికల కమిషన్ పని ఏమిటి? ఎన్నికల కమిషన్ తన బాధ్యతను నిర్వర్తించాలన్నారు. ఓ వైపు ప్రజల్లో, ప్రధాన రాజకీయ పక్షాలలో ఎన్నికల ప్రక్రియ పై, అది నిర్వహించే సంస్థ పై అనేక అనుమానాలు ఉన్నపుడు వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఈసీ దే అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అనేది చాల ముఖ్యమైనది, అలాంటి ఓటుని కూడా బీజేపీ పాలనలో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే పరిస్థితి కూడా లేదు అని, కళ్ళకి కట్టినట్టుగా రాహుల్ గాంధీ ప్రెసెంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. రాజ్యాంగం గొప్ప పత్రం అయినప్పటికీ, దాని విజయం, దానిని అమలు చేసే వారి ఉద్దేశాలు, చర్యల పై ఆధారపడి ఉంటుందని అంబేద్కర్ విశ్వసించారన్నారు.. వారు దానిని దుర్వినియోగం చేసినా లేదా నిర్లక్ష్యం చేసినా, రాజ్యాంగం బలహీన పడవచ్చని,1949లో రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో, " రాజ్యాంగం ఎంత మంచిదైనా, దానిని అమలు చేసేవారు చెడ్డవారైతే, అది చెడ్డదే అవుతుంది, రాజ్యాంగం ఎంత చెడ్డదైనా,




దానిని అమలు చేసేవారు మంచివారైతే, అది మంచిదే అవుతుంది " అని ఆయన నొక్కి చెప్పారు అని సత్యం శ్రీరంగం అన్నారు. దేశంలో నియంతృతంగా పరిపాలిస్తున్న భారతీయ జనతా పార్టీ విధానాలను ఎండగడుతున్నాడని, భారతీయ జనతా పార్టీ 11 సంవత్సరాలు వ్యవస్థల్ని చిన్నాభిన్నం చేస్తుంటే, వ్యవస్థల్ని భ్రష్టు పట్టిస్తుంటే చూసి తట్టుకోలేక ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ప్రశ్నిస్తున్నాడని, వారిని ప్రశ్నిచడమే తప్పా? ఇది ఏ విధంగా న్యాయం, ఇది ఏ విధంగా ధర్మం? వందకి వంద శాతం తమ ఆరోపణలో నిజం ఉందన్నారు. దేశంలోని పలు రాష్టాలలో ఎన్నికల సంఘం ఈసీ తో కలసి బీజేపీ ఓట్ల చోరీకి పాల్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా కూడా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు భారత దేశ పార్లమెంట్ లో ప్రధాన ప్రతి పక్ష నేతగా రాహుల్ గాంధీ ఎలక్షన్ కమిషన్ చేస్తున్న అరాచకాల మీద దేశ వ్యాప్తంగా కూడా పోరాటానికి పిలుపుని ఇచ్చారని తెలిపారు. దీనికి మద్దతుగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ఈ పోరాటంలో తమతో చేరండని సత్యం శ్రీరంగం కోరారు.

# ఇల్లంతకుంట సహకార సంఘంలో అక్రమాలపై విచారణ జరిపించాలి

### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారం నర్సయ్య



ఇల్లంతకుంట, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై పలుమార్లు విజ్ఞప్తి చేసిన సహకార అధికారులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గన్నారం నర్సయ్య ఆరోపించారు.సోమవారం మండలకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ...గత రెండు నెలల క్రితం సహకార సంఘ కొనుగోలులో వచ్చిన కమిషన్లు, గన్ని బ్యాగుల సమాచారంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా ఇచ్చిన సమాచారాన్ని పరిశీలిస్తే ఒక్కొక్క సీజన్లో 10నుండి 25లక్షల వరకు గన్నీ బ్యాగుల ద్వారానే కోతలు జరిగాయని ఉద్యోగుల నిర్లక్ష్యంతో గత మూడేళ్లుగా 7సీజన్లలో 80లక్షల నష్టం సహకార సంఘానికి జరిగిందని పేర్కొన్నారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో ఐదుగురు సిబ్బంది ఉండగా గన్ని బ్యాగులు, టల్ఫిన్ కవర్లు, కాంట బాట్లు గానీ దొంగిలించబడితే తాత్కాలిక ఉద్యోగులకు జీతంలో కోతలు విదించి మిగతా వాళ్ళకు సంఘం ద్వారా జీతాలు ఇస్తారని, పకడ్బందీ సిబ్బంది ఉన్నా సంఘంలో లక్షల దుర్వినియోగం ఎలా జరిగిందంటూ ప్రశ్నించారు. దీనిపై పూర్తి విచారణకు జిల్లా సహకార అధికారికి, కలెక్టర్ కు త్వలోనే వినతి పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొంటూ సహకార సంఘంలో లోన్ తీసుకున్న ప్రతీ రైతుకు వాటా ఉంటుందని సంఘంలో జరిగే నష్టాన్ని రైతులు గ్రహించాలని సూచించారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఇల్లంతకుంట సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై పూర్తి విచారణ చేసి నష్టానికి కారకులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సహకార సంఘం ముందు రైతులతో ధర్నా కార్యక్రమం చేస్తామని గన్నారం నర్సయ్య హెచ్చరించారు.

# అల్ఫోర్స్ టైనీ టాట్స్‌లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



కరీంనగర్ ప్రతినిధి ఆగష్టు 11(క్రైమ్ న్యూస్) : విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారికి ఆరోగ్యం యొక్క విశిష్టతను తెలియపరచవలసిన అవసరం ఎంతగానో ఉందని తద్వారా వారు ఆరోగ్యంగా ఉంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు ..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా వారికి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చడం ఈ కాలంలో ఒక గొప్ప సవాలుగా మారినదని వారు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో పౌష్టికర ఆహారం పట్ల విస్తృతంగా అవగాహన కల్పించాలని తద్వారా వారు చదువు పట్ల ఆసక్తి కనబరచడమే కాకుండా అందులో రాణించడం సులభతరం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు అవగాహన లేమి వలన రోగాల బారిన పడటం చాలా విచారకరమని ఇటువంటి సందర్భాల్లో తప్పనిసరిగా ప్రభుత్వంతో సమన్వయపరిచి విస్తృతంగా అవగాహన కల్పించాలని వారు కోరారు...ఈ మాత్రల ద్వారా విద్యార్థులకు శరీరం యొక్క రోగ నిరోధక వ్యవస్థను విస్తరింప చేయవచ్చని.. అంటువ్యాధులను చికిత్స చేయడానికి ఉపయోగపడతాయని వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారు విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా మరియు ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం చాలా హర్షించదగ్గ విషయమని.. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వారి పిల్లల యొక్క ఆరోగ్యం పట్ల దృష్టి సారింప చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్టా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సమస్య రహిత డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

### కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు.



కూకట్పల్లి ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటానని కూకట్పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ కాలనీ లో భారీ వర్షాలకు డ్రైనేజ్ నీరు పొంగి నిల్వ ఉండటం వలన కాలనీ వాసుల ఇబ్బందిపడుతున్నారని సమాచారం మేరకు, హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి సిబ్బందితో కలసి పరిశీలించి, పనులను వెంటనే మొదలుపెట్టి సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలిపారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాస రావు మాట్లాడుతూ, భారీ వర్షాలకు డ్రైనేజి నీరు పొంగి నిల్వ ఉండటం వలన కాలనీ వాసుల ఇబ్బందిపడుతున్నారని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు అధికారులను తీసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని చెప్పడం జరిగిందని, అలాగే ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని, సంతులిత, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. అదేవిధంగా కాలనీ వాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, కాలనీ వాసులందరి సమిష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని కార్పొరేటర్ తెలిపారు. ఏ చిన్న సమస్య ఐనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, అదేవిధంగా డివిజన్ లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు అన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఎస్ బి మేనేజర్ ప్రియాంక, డ్రైనేజ్ సూపర్వైజర్ నరేంద్ర, డివిజన్ నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలన మాత్రలు పంపిణీ...

జమ్మికుంట ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జమ్మికుంట మున్సిపల్ మరియు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో నులిపురుగుల నిర్మూలన మాత్రలు ఆల్బెండజోల్ 44 ప్రభుత్వ పాఠశాలలు 56 అంగన్వాడీ కేంద్రాలు,17 ప్రైవేట్ పాఠశాలలు,4ప్రభుత్వ జూనియర్ కళాశాలలు,3 ప్రైవేటు జూనియర్ కళాశాలలు,1 ప్రభుత్వ డిగ్రీ కళాశాల,2 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పిల్లలకు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో పంపిణీ చేయడం జరిగింది. ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ చందు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసి లాంచనంగా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి పిల్లలకు వివరించారు.మాత్రలు వేసుకోకుండా ఉన్న పిల్లలకు ఈనెల 18 వ తేదీ నాడు వేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్, డాక్టర్ చందన, డాక్టర్ ఫర్హానుద్దీన్, డాక్టర్ బిందు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ సంధ్య,హెల్త్ ఎడ్యుకేటర్స్ పంజాల ప్రతాప్ గౌడ్,అడిదెల మోహన్ రెడ్డి, సూపర్వైజర్స్ రత్నకుమారి,అరుణ, కుసుమ కుమారి సదానందం, వైద్య సిబ్బంది,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్.



కూకట్పల్లి ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : జాతీయ నులిపురుగుల నిర్ములన దినోత్సవం సందర్భంగా కూకట్పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు నులి పురుగులు నివారణ కోసం ఉచిత మందులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతులమీదుగా ఎల్లమ్మబండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్, డాక్టర్లు మాట్లాడుతూ నులి పురుగులు చాలా ప్రమాదకరమైనవి, పిల్లలు అపరిశుభ్రమైన ప్రదేశాల్లో ఎక్కువగా ఆటలు ఆడటం, మల విసర్జన ద్వారా నులి పురుగులు వ్యాప్తిచెందే అవకాశాలున్నాయని అన్నారు. నులి పురుగుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే ఉత్తమం అన్నారు. అలాగే భోజనం చేసే ముందు తప్పకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రమైన నీటిని తాగాలి అని తెలిపారు. పిల్లలందరూ వైద్య నిపుణులు, ఉపాధ్యాయులు చెప్పినవి శ్రద్ధగా విని ఆరోగ్యంగా ఉండాలని తెలియచేసారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, గుడ్ల శ్రీనివాస్, డాక్టర్లు డి.మౌనిక, సుజీలీల, కృష్ణవేణి, సంతోషి, రాజ్యలక్ష్మి, శిశిరేఖ, పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# డి.వి.జి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలకు ఆర్థికసాయం.

కూకట్పల్లి ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : కూకట్పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్



ఎల్లమ్మబండ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీ లో నివసించే ఉప్పలపు వెంకట నాగేశ్వరరావు(51) అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా 5,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, సంగమేష్, కాలనీ వాసులు తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# గ్యాస్ రీఫిలింగ్ చేయడం చట్టరీత్యా నేరం


### గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పెద్దపల్లి డిసిపి కరుణాకర్ గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో కలిసి గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లక్ష్మి నగర్ లో కొంతమంది గ్యాస్ స్టవ్ల సిలిండర్ల రిపేరు పేరుతో షాప్ లలో పెద్ద గ్యాస్ సిలెండర్ నుండి చిన్న సిలెండర్ లలో గ్యాస్ రీఫిలింగ్ చేస్తున్నారు అని సమాచారం మేరకు ప్రజా భద్రత చర్యలలో భాగంగా గోదావరిఖని లక్ష్మీ నగర్ లోని అన్ని గ్యాస్ స్టవ్ సిలెండర్ వస్తావులకు సంబంధించిన షాపులని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ కొంతమంది షాపు యజమానులు కొంతమంది వ్యక్తులు అక్రమార్జనకు అలవాటు పడి చట్ట విరుద్ధంగా పెద్ద సిలిండర్ లను గ్యాస్ రిపేర్ షాపు యజమానులకు అమ్మడం అట్టి గ్యాస్ ను షాప్ యజమానులు చిన్న సిలిండర్లలోకి మరియు ఎలక్ట్రిక్ డిసి మోటార్ల ద్వారా పైపులు బిగించి కార్లలో గ్యాస్ రీఫిలింగ్ నిర్వహించడం జరుగుతుంది. అలా గ్యాస్ నింపే క్రమంలో కొద్దిరోజుల క్రితం గ్యాస్లు సిలిండర్ నుండి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని కొంతమంది వెంటనే స్పందించడం వల్ల మంటలు ఆర్పగలిగారని లేకుంటే పెద్ద ప్రమాదం జరిగేది అన్నారు. చట్ట విరుద్ధంగా సిలిండర్ ల నుంచి గ్యాస్ రీఫిలింగ్ చేయడం నేరం మరియు వారికి సిలెండర్ లు అమ్మి సహకరించిన వారు కూడా నేరస్తులుగా పరిగణించబడతారు. ప్రజలు నివాసం మరియు రద్దీగా ఉండే ప్రాంతాల్లో షాప్ లలో నింపి ఉన్న గ్యాస్ సిలెండర్స్ నిల్వ చేయడం ప్రమాదకరం. వాటిని గ్యాస్ గోదాం లలోనే ఉంచాలి గ్యాస్ స్టవ్ సిలెండర్ షాప్ లలో రీఫిలింగ్ చేయడం అనేది ప్రమాదకరం ఇలాంటి చట్ట విరుద్ధమైన పనులు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రజా భద్రతకు జీవనానికి భంగం కలిగించే విధంగా భవిష్యత్తులో చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడకుండా ప్రవర్తించకూడదని ముందస్తు చర్యలలో భాగంగా గ్యాస్ స్టవ్ లు సిలిండర్లు రిపేరు చేసే యజమాలను అందులో పని చేసే వారిని బైన్డోవర్ చేయడం జరిగిందని సిఐ ప్రకటన తెలిపారు.

# శ్రీనివాస్ నగర్‌లో కోతులు, కుక్కల బెడదను పరిష్కరించండి

### మాజీ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్



మానకొండూర్, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం శ్రీనివాస్ నగర్ లో కోతులు,కుక్కల బెడదను పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు.గత కొన్ని నెలలుగా కోతులు ఇండ్లలోని సరుకులు ఎత్తుకెళ్తూ రోడ్డుపై ఒంటరిగా వెళ్ళే వారిని దాడి చేస్తుంటే, ఇగ వింతరోగాలతో కుక్కలు వీదుల్లో తిరుగుతూ కనిపించిన వాళ్ళపై దాడి చేస్తుండడంతో కోతులు, కుక్కలతో గ్రామస్తులు భయాందోళనలనకు గురౌతున్నారని వాటిని దూరంగా అరణ్యాల్లో విడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుని గ్రామ ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నట్లు ఎరుకల శ్రీనివాస్ గౌడ్ వినతిపత్రంలో పేర్కొన్నారు.

# మార్పు కోరుకుంటే రైతులు ఏడ్చే మార్పు జరిగింది

### ఇల్లంతకుంట మండల రైతుల ఆవేదన

ఇల్లంతకుంట, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ సొసైటీలో సరైన యూరియా నిల్వలు లేక తెల్లవారుజాము నుండే రైతులు బస్తాల కోసం లైన్లలో బారులు తీరి ఇబ్బందులకు గురై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారుజామున 4గంటల నుండి పడిగాపులు కాస్తున్నా మనిషికో బస్తా ఇచ్చే పరిస్థితి లేదని 500మంది రైతులు ఉంటే సొసైటీకి వచ్చింది 230బస్తాలేనని, దాచారం, రామోజీ పేట,అనంతగిరి, సిరికొండ,పెద్ద లింగాపూర్ గ్రామాలకు కలిపి ఒకే సొసైటీ ఉండగా అవసరమైనన్ని బస్తాలు లేకపోవడం వల్ల యూరియా కొరతతో ప్రభుత్వంపై మండల రైతులు మండిపడుతున్నారు.గత ప్రభుత్వంలో ఎన్నడూ యూరియాకు ఇబ్బంది పడలేదని, కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వమని చేప్పే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మార్పు కోరుకున్న రైతులు ఏడ్చే విదంగా గొప్ప మార్పు జరిగినదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సొసైటి సిబ్బందిని వివరణ కోరగా ఉన్న బస్తాలను ఒక్కరికి 2బస్తాలుగా ఇచ్చామని చాలకపోవడంతో మరో 40టన్నులకు ఇండెంట్ పెట్టామని రెండు మూడు రోజుల్లో వచ్చే స్టాక్ ను రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.



# యూరియా కోసం రోడ్ ఎక్కిన రైతన్న...



వీణవంక ఆగస్ట్ 11 (ది క్రైమ్ న్యూస్) : పోలీసుల పహారా నడుమ రైతులకు యూరియా పంపిణీ చేసిన సంఘటన సోమవారం వీణవంక మండలం నర్సింగాపూర్ లోని సొసైటీ వద్ద చోటు చేసుకుంది. యూరియా లారీ వచ్చిందని తెలిసిన రైతులు భారీగా అక్కడకు చేరుకున్నారు. అంతకుముందు జమ్మికుంట కరీంనగర్ ప్రధాన రహదారి పై ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సాగుకు సరిపడా యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని కోరారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఝాన్సీ రెడ్డి



తొర్రూరు, ది క్రైమ్ న్యూస్ : బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. తొర్రురు పట్టణంలోని 13వ వార్డులో అప్పలశెట్టి నాగమణి, గంగి శెట్టి వెంకటేశ్వర్లు, జాటోత్ సరోజ,12 వ వార్డులో అలువాల అంజయ్య, గొల్లపెల్లి సురేష్,14 వార్డులో దారం నాగయ్య లు ఇటీవల మృతి చెందగా, మహిళ నాయకురాలు జాటోత్ అమల రోడ్డు ప్రమాదంలో గాయపడగా సోమవారం వారి కుటుంబాలను సందర్శించి,ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలను అన్ని విధాలుగా కాపాడుకుంటామని పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు.ఆమె వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, ఏఎంసి డైరెక్టర్ కందాడి అచ్చిరెడ్డి, నాయకులు డాక్టర్ కొనుగోటి సోమేశ్వరరావు,చాపల బాపురెడ్డి, జీనుగా సురేందర్ రెడ్డి, గంజి విజయపాల్ రెడ్డి,ధరావత్ రాజేష్ నాయక్, చిత్తలూరి శ్రీనివాస్ గౌడ్, చెవిటి సధాకర్,జలకం శ్రీనివాస్, అలువాల సోమయ్య, బిజ్జాల అనిల్,చిదిరాల రవి, వెలుగు మహేశ్వరి, పంజా కల్పన,యశోద, జాటోత్ సురేష్,రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి.



ధర్మపురి, అగష్టు 11, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక జెడ్పి హెచ్ ఎస్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్య అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వైద్య అధికారులతో కలిసి నులిపురుగుల నివారణ మాత్రలను అందజేసారు. అనంతరంఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పిల్లలు నిత్యం చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, తిన్నాప్పుడే కాదు, ఆడిన తర్వాత, టాయిలెట్ వెళ్లిన తర్వాత కూడా శుభ్రత పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, ముఖ్యంగా నులిపురుగుల వల్ల వ్యాపించే వ్యాధుల నివారణలో పరిశుభ్రత కీలకం అని మంత్రి పేర్కొన్నారు. అదే విధంగా ప్రతి ఇంట్లోనూ, పాఠశాలల్లోనూ పరిశు భ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకుని సకాలంలో టీకాలు వేయించుకోవాలని ఆరోగ్యంతో పాటు విద్యార్థుల మానసికాభివృద్ధికీ పరిశుభ్రత అవసరమని ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరు అని ఆయన మంత్రి అడ్లూరి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## అది పులి కాదు హైన.

**ప్రజలు భయపడాల్సిన పని లేదు.**

**జిల్లా అటవీ శాఖ అధికారి ఎం. రవిప్రసాద్.**



ధర్మపురి, ఆగష్టు 11, (ది క్రైమ్ న్యూస్) : గడిచిన మూడు రోజుల క్రితం ధర్మపురి శివారులో వ్యవసాయ కూలీలకు, రైతులకు కనిపించిన జంతువు పులి కాదని అది హైన అని జిల్లా ఫారెస్ట్ అధికారి ఎం. రవిప్రసాద్ నిర్ధారించారు. సోమవారం పట్టణంలో ని గిరికల కాలనీలో మళ్ళీ పులి సంచరిస్తుందనే సమాచారం అందుకున్న పట్టణ ఫారెస్ట్ అధికారులు అక్కడి కి వెళ్లి చూడగా దాని పాదముద్రలు కనిపించినట్లు వాటిని ఫోటోలు తీసి ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించగా అవి పులి పాదముద్రలు కావని తేల్చినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, రైతు లు ఎవరు భయపడాల్సిన పని లేదని ఎవరి పనులు వారు చేసుకోవచ్చని ఫారెస్ట్ అధికారులు హామీ ఇచ్చారు. రైతు లు ఎవరూ రాత్రి వేళల్లో పంట పొలాలకు వెళ్లవద్దని వారు హెచ్చరించారు.

## రైతు రాజ్యంలో...

# అన్నదాతకు ఇదేం గోస.

## దొరకని యూరియా..

ఫర్టిలైజర్ షాపుల శ్రావణ మాసం బంపర్ బొనంజా ఆఫర్.

ఒకటి కొంటే ఒకటి ఉచితం కాదు.

ఇది కావాలంటే.. అది కొనాల్సిందే.

కొరత లేదంటున్న నాయకులు, అధికారులు.

ఆనాటి రోజులు వచ్చినయ్ అంటున్న జనాలు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్.

*యూరియా కొరతపై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న ప్రత్యేక కథనం...*




బాగా ఆకలి మీద ఉన్నప్పుడు గంజి మెతుకులు అందివ్వనోడు... ఆకలి చచ్చాక భగారా ఇస్తేనేమి, బిరియాని తెస్తేనేమి అంటున్నారు భూమి పుత్రులు. బిడ్డ ఆకలి తల్లికి తెలిసినట్టు, మొక్కలు నీటికి ఎప్పుడు ఇబ్బంది పడతాయో, తిండికి( ఎరువులు ) ఎప్పుడు అలమటిస్తాయో చంటి బిడ్డల వలె పెంచుకునే రైతన్న కంటే ఎవరికి ఎక్కువ తెలుసు? ఇప్పుడు ఆ మొక్కలు నీటి కోసం తండ్లాడుతున్నాయి, బువ్వ కోసం ఎక్కెక్కి ఏడుస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో పంటలకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందనే విషయం తెలియని వాళ్ళు ఎందరు? ఎందుకంటే అప్పటికి పలు పంటలు నెల రోజుల వయసు కలిగి ఉండడం వల్ల ఏపుగా పెరగడం కోసం యూరియా తప్పనిసరి. మరి ఈ సంగతి నాయకులకు అధికారులకు తెలియదా? అంటే కచ్చితంగా తెలుసు. ఎందుకంటే వాళ్లు కూడా రైతు బిడ్డలమనే చెప్పుకుంటున్నారు కాబట్టి.యూరియా వాడకాన్ని విచ్చల విడిగా వినియోగిస్తున్నారనే సాకుతో ప్రభుత్వాలు నేడు రైతన్నలతో చదరంగం ఆడుతున్నాయి. యూరియా కొరత అసలు లేనే లేదంటూ... రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేస్తున్నామంటూ అధికారులు సన్నాయి నొక్కులు నొక్కుతుంటే .... మాది ప్రజా ప్రభుత్వం, రైతు రాజ్యం, రైతు సంక్షేమమే మా ధ్యేయం, నేడు రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నాం అంటూ నాయకులు రాగాలు తీస్తున్నారు. సహకార సంఘాల దగ్గర పొద్దంతా పడిగాపులు కాసినా బస్తా దొరుకుతుందన్న గ్యారెంటీ లేదు. ఉదయం 7 గంటలకే గోదాముల దగ్గర చెప్పులను క్యూ లైన్ లో పెట్టి తమ వంతు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. పోలీసుల పహారాలో మూడు బస్తాల కోసం మూడు జాములు పస్తులు ఉంటున్నారు. మళ్లీ ఆనాటి రోజులు వచ్చినయ్ అంటూ ఒకరికొకరు చెప్పుకుంటూ బాధను వెళ్లగక్కుతున్నారు. మనిషన్నవాడు మాటమీద నిలబడాలంటారు. ఎవరి సంగతి ఏమోగానీ నాయకులు అధికారులు మాత్రం మాట మీదనే నిలబడుతున్నారు. ఇంతకుముందు చెప్పినట్టే అస్సలు యూరియా కొరత లేనే లేదంటున్నారు అందరికీ సరిపడా అందిస్తున్నాం అంటున్నారు. మరి పొద్దున్నే లేచి పొలం పనుల్లో మునగక ఈ రైతులెందుకు గోదాముల దగ్గర గుమిగూడుతున్నారు? అన్నదే ఇక్కడ యూరియా గుళికంత ప్రశ్న. ఇక సందట్లో సడేమియా అన్నట్టు ఫర్టిలైజర్ షాపుల యజమానులు 300 రూపాయల యూరియా బస్తా కావాలంటే 1300 రూపాయల మరో కాంప్లెక్స్ ఎరువుల బస్తా కొనాల్సిందే అంటూ లింకు పెట్టి రైతు నరాలను వడి పెడుతున్నారు. షాపింగ్ మాల్స్ లో శ్రావణమాసం బంపర్ బోనంజాల పేరుతో అక్కరకురాని స్టాక్ నంతా అమ్ముకొని లాభాలు పొందినట్టు ఇప్పుడురైతుల అవసరాన్ని గుర్తించి ఇదే మంచి అవకాశం అన్నట్టు అక్కరకురాని చెత్తనంతా యూరియాతో అంటగడుతున్నారు. కేవలం యూరియానే కావాలంటే లేదు పొమ్మని ముఖం మీదనే చీదరించుకుంటున్నారని ది క్రైమ్ న్యూస్ తో కొందరు రైతులు తమ బాధను చెప్పుకొచ్చారు. ఇది ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలో రైతు సంక్షేమ ప్రభుత్వంలో రైతన్నలు పడుతున్న గోసల్లో మచ్చుకు ఒకటి మాత్రమే. ఏది ఏమైనా తమ అవసరాలకు సరిపోయే విధంగా యూరియాను అందించాలంటూ లేకుంటే పంటలు ఎదగక తాము తీవ్రంగా నష్టపోతామంటూ నాయకులను అధికారులను కోరుతున్నారు.

## కాటారంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి దుద్దిల్ల



భూపాలపల్లి/కాటారం/ఆగస్టు -11:(ది క్రైమ్ న్యూస్) : కాటారం మండలంలో పలు అభివృద్ధి పనులకు సోమవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండల కేంద్రంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీపాద చిల్డ్రన్ పార్క్ ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అలాగే అంకుషాపూర్, నస్తురుపల్లి గ్రామాల్లో ఒక్కోటి రూ.50 లక్షల చొప్పున, మొత్తం రూ.1 కోటి వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.చిదినేపల్లి, గుంద్రాత్‌పల్లి, దామెరకుంట, రేగులగూడెం, వడిపిలవంచ, బూడిదపల్లి, ఇబ్రహీంపల్లి గ్రామాల్లో రూ.84 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసారు చేశారు. అలాగే కాటారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంకు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న మరమ్మత్తు పనులను శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ భవనానికి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



తిమ్మాపూర్, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం బాలయ్యపల్లిలో సోమవారం గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు.పలు వార్డుల్లో చేపట్టిన పనుల ప్రగతిని పరిశీలించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధిలో పార్టీలకతీతంగా భాగస్వాములై అభివృద్ధికి పాటుపడాల్సిన అవసరం ఉందని ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఏ.ఈ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్ గౌడ్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపి తుమ్మనపల్లి శ్రీనివాసరావు, నాయకులు చింతల లక్ష్మారెడ్డి, గొట్టిముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, గ్రామశాఖ అధ్యక్షులు గోదారి చిట్టిబాబు, పెంట వినోద్ కుమార్, కాసర్ల సంపత్, రొడ్డ సాగర్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శంకరపట్నంలో జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం



శంకరపట్నం, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కేజీబివి,ఆదర్శ పాఠశాలలో సోమవారం జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవ కార్యక్ర మాన్ని ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో నిర్వహించారు. నులిపురుగులు రావాడానికి ప్రదాన కారణాలను వివరించి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.బోజనానంతరం వయస్సును బట్టి నులిపురుగుల నివారణకు ఆల్బెండజ్లోల్ 400ఎమ్జి మాత్రను ఇచ్చారు.కార్యక్రమంలో ఎంపీఓ ప్రభాకర్, మండల వైద్యాధికారి వైద్యులు శ్రావణ్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ అధికారి భాస్కర్, సూపర్వైజర్ అనీల్ కుమార్, ఏఎన్ఎం శ్రీవాణి,ఆర్బిఎస్కే సరిత, ఆయుష్ విభాగం వైద్యులు సంధ్య,శ్రావణి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

**టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**



తొర్రూరు, ది క్రైమ్ న్యూస్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ అనుమాన ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో పట్టణ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని,రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ పతాకాన్ని ఎగరేయడానికి గ్రామం నుండి పట్టణం వరకు ప్రతి స్థాయిలో సమైక్యంగా పని చేయాలన్నారు వ్యక్తిగత విభేదాలు పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలి పిలుపునిచ్చారు.తాటాకు చప్పులకు నేను భయపడనని, ప్రజల ప్రేమ మద్దతే నాకు బలమన్నారు.ఎలాంటి అవరోధాలు ఎదురైనా వెనకడుగు వేయనని, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నా కృషి కొనసాగుతుందని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం గాంధీ-నెహ్రూ స్ఫూర్తి తో నా విలసమైన జీవితాన్ని అంకితం చేసుకున్నానని గుర్తు చేశారు.ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల వారీగా పార్టీ పరిస్థితులపై, బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాలపై ప్రచారం చేయాలని, ప్రతి ఇంటికి కాంగ్రెస్ పార్టీ సందేశం చేరేలా తలుపు తట్టి ప్రచారం చేయాలని, ప్రజల సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారం కోసం స్థానిక స్థాయిలోనే కృషి చేయాలని సూచించారు. పార్టీ పట్ల కార్యకర్తల ఉత్సాహం చూసి ఝాన్సీ రెడ్డి సంతోష వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వరరావు, మంగళపల్లి రామచంద్రయ్య, జీనుగా సురేందర్ రెడ్డి, జలకం శ్రీనివాస్, నర్కుటి గజానంద్, భాస్కర్ రెడ్డి, దొంగరి శంకర్,నల్లపు రాజు, అలువాల సోమయ్య, సురేందర్, బిజ్జాల్ అనిల్, చిదిరాల రవి, హేమంత్ నాయక్, వెలుగు మహేశ్వరి,పంజా కల్పన, అనిత, ఉమా, యశోద, రమేష్ నాయక్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యాళ్ల హరీష్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు రామగుండం నియోజకవర్గ నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి కి కుక్కల గూడూర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నాయకులు కార్యకర్తలు సమిష్టి గా సమన్వయము చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. అయితే సాగునీటి రంగం కానీ, వ్యవసాయ రంగం గానీ బిఆర్ఎస్ పార్టీ హయాంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లిందని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నియంత పాలనలో రైతులు పలు కష్టాలు ఎదుర్కొంటున్నారని భవిష్యత్తులో తప్పకుండా మన ప్రాంతంలో రైతులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని, రైతుకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వాన్ని నిలదీస్తూ రైతు పక్షాన నిలబడతానని ఆయన తెలిపారు ఈ కార్యక్రమం లో కుక్కలాగూడూర్ మాజీ సర్పంచ్ గొంద్ర చందర్, బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కుదిరె సతీష్, ఉపాధ్యక్షులు సట్ట ఏలీయా. నాయకులు,మేకల మొగిలి , ఆలేటి శంకరయ్య,మహేష్, గొంద్ర విష్ణు, బండారి కార్తీక్. ముద్దసాని సాగర్ నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలి

**ప్రభుత్వ దవఖానలో మితిమీరుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జోక్యం**

**దళిత సిబ్బందిని తొలగిస్తున్న వైనం**

**అసలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాలా, ప్రభుత్వ దవఖాన సూపరిడెంటా**

**చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు**

**ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**

గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్)రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేయడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ సందర్భం సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ రామగుండం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వారంలో మూడు రోజులు మాత్రమే కళాశాలకు వస్తున్నారని,మిగతా రోజుల సంగతి మాకు తెలియదని విద్యార్థులు చెప్పారని ఆయన అన్నారు. ప్రధానంగా విద్యార్థులకు పాఠాలు బోధించడానికి సరిపడు ప్రొఫెసర్లు లేనప్పటికీని , ప్రిన్సిపాల్ గా పాఠాలు బోధించకుండా, ప్రొఫెసర్ల కొరతపై దృష్టి పెట్టకుండా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పాఠాలు బోధించి పోటీ తత్వాన్ని పెంపొందించి తెలంగాణ రాష్ట్రంలోనే రామగుండం మెడికల్ కళాశాలను మొట్టమొదటి స్థానంలో నిలిపి చరిత్ర సృష్టించే అవకాశం ఉన్నప్పటికీని ఇవేమీ పట్టించుకోకుండా మా జీతం మాకు వస్తే చాలు విద్యార్థుల భవిష్యత్తుతో మాకేం పని అనే విధంగా వ్యవహరిస్తున్నారని, విద్యాబుద్ధులు నేర్పించాల్సిన వారు వారంలో మూడు రోజులు గైర్హాజరైతే విద్యార్థులకు ఏం సందేశం ఇస్తారని ఆయన విమర్శించారు.అదేవిధంగా అసలు ఈ ప్రిన్సిపాల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాలా, ప్రభుత్వ దవఖాన సూపరిడెంటా అని ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ దవఖానలో విధులు




నిర్వహించే కొంతమంది దళిత సిబ్బందిని కక్షపూరితంగా సస్పెండ్ చేయడం జరుగుతున్నది, ప్రభుత్వ దవఖానకు ప్రిన్సిపాల్ కి ఏం సంబంధం ఉన్నదని, సస్పెండ్ చేసిన వారిని యుద్ధ ప్రాతిపాదికన ఉద్యోగంలో తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తూ , ప్రభుత్వ దవఖానలో జోక్యం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని, కార్యాలయాలు ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గోడిసెల ప్రణీత్ , అక్కపాక సాయి చరణ్, జశ్వంత్, సజన్, సాయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు



శామీర్ పేట, ఆగస్టు 11 (ది క్రైమ్ న్యూస్) : శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో శివ కేశవులను ఎంతో నిష్టతో ఆరాధిస్తారు. ఇందులో భాగంగా శ్రావణ సోమవారం పురస్కరించుకొని శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం హారతి, మంత్రపుష్పం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

# 4వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి: సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి



తిమ్మాపూర్, ఆగస్టు 11,(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఇంద్రనగర్ లో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో మహాసభల గోడ ప్రతులను సోమవారం ఆవిష్కరించారు.సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ.... సమ సమాజమే లక్ష్యంగా ఆవిర్భవించి అనేక త్యాగాల చరిత్ర కలిగిన సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ లో నిర్వహించే రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వందేళ్ళ ప్రస్థానంతో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని, బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను వెలుగులోకి తీసుకురావడంలో కమ్యూనిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని తద్వారా గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 240 సీట్లకు కట్టడి చేయడంలో విజయం సాధించామని పేర్కొన్నారు.అసంఘటిత కార్మికుల వేతనాలు పెంపు కోసం సిపిఐ రాజీలేని పోరాటాల నిర్వహిస్తుందని అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ మరింత పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సన్నద్ధమైయ్యేందుకు మహాసభల వేదికగా కార్యచరణను రూపొందించామని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బీసీ బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకని విమర్శిస్తూ ఓవైపు బీసీ బిల్లుకు అడ్డుపడుతున్న బిజెపి మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బీసీ బిల్లును గత నాలుగు నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో సైతం ఇదేవిధంగా చేయడం సమంజసం కాదన్నారు.కార్యక్రమంలో ఇంద్రనగర్ గ్రామ శాఖ కార్యదర్శి గంగిపల్లి శంకర్, సిపిఐ నాయకులు అల్వాల రాజయ్య, దొంత శంకర్, దొంత తిరుపతి, అల్వాల శేఖర్, చక్రమంజి, దొంత కనకయ్య, బండి శ్రీనివాస్, సతీష్, అలువల లక్ష్మణ్ పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల అవస్థలు

**- పడిగాపులు కాస్తున్నా పట్టించుకోని వైనం**



తొర్రూరు, ది క్రైమ్ న్యూస్ : రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ఇది రాష్ట్ర ప్రభుత్వానికి అరిష్టమని రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట్ రెడ్డి,బహుజన సామాజిక కార్యకర్తలు సురేష్ బాబు ,సంతోష్ ,బాలాజీ లు రైతులతో కలిసి తొర్రూరు పట్టణ కేంద్రంలోని అన్నారం రోడ్డు వద్ద పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూరియా షాపు ముందు రోడ్డుపై ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో రైతులకు యూరియా అందించటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు అన్నారు.యూరియా బ్లాక్ మార్కెటింగ్ ద్వారా అధిక ధరలకు ప్రైవేట్ షాపులు అమ్ముతున్నారని దీన్ని అధికారులు అరికట్టాలని వారు అన్నారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు ప్రైవేటు షాపులు యూరియాను అమ్ముతున్నాయని, దీనిని అరికట్టి రైతులకు న్యాయం చేయాలని అన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యలో రైతుల జీవితాలు ఆగమవుతున్నాయని అన్నారు. షాపు నిర్వాహకులు యూరియాను ఇచ్చేటప్పుడు యూరియాతోపాటు గుళికలో లింకులు పెట్టి ఇస్తున్నారని రైతులు అనవసరంగా డబ్బులు పోగొట్టుకుంటున్నామని వాపుతున్నారు.రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమాలు నిర్వహిస్తారని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ యాకన్న, వీరన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంధులకు బ్రెయిలీ మెటీరియల్స్ అందజేత




తొర్రూరు, ది క్రైమ్ న్యూస్: లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మూరు కావ్య రెడ్డి సహకారంతో 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సుమారు 2 లక్షల విలువ గల బ్రెయిలీ మెటీరియల్ ను అంధ విద్యార్థినీ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ లయన్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ సేవా తరుణి ఆధ్వర్యంలో చేస్తున్న ప్రతి ఒక్క కార్యక్రమం చాలా విలువైందన్నారు.అవసరార్థులను గమనించి వారి అవసరాలు తీరుస్తున్నారని, ఇలాంటి సేవా కార్యక్రమాలను పర్మినెంట్ ప్రాజెక్టుగా తీసుకోవడం చాలా గొప్ప విషయం అన్నారు. సేవలందిస్తున్న సేవా తరుణి అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ విడిజి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని అవయవాలు ఉండి ఇంకా ఏదో లేదని బాధపడుతున్న వారి కన్నా తమ పనులు కూడా తాము చేసుకోలేని దీన స్థితిలో ఉన్న ఇటువంటి చిన్నారులకి సహాయం చేయాలనే ఆలోచన రావటం వెనక ఉన్న కావ్య గొప్ప మనసుకి కృతజ్ఞతలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంజిఎఫ్ డిస్ట్రిక్ట్ చీఫ్ సెక్రటరీ సర్వీస్ లయన్ మార్గం ప్రభాకర్, డిస్టిక్ ఫస్ట్ లైన్ లేడీ లయన్ డాక్టర్ రాజేశ్వరి జిల్లా జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ డాక్టర్ వేలూరు శారద, ఎం జి ఎఫ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యులు లయన్ డాక్టర్ నాగవాణి, వజినపల్లి శైలజ, సేవా తరుణి సెక్రెటరీ లయన్ కూన పద్మావతి, ట్రెజరర్ లయన్ వేముల మంజుల, ఎఫ్ డబ్ల్యూ సి చైర్ పర్సన్ లయన్ ఉమా రెడ్డి తదితరు లు పాల్గొన్నారు.

# ఫామ్‌హౌజ్‌లో కెటిఆర్,హరీష్‌లతో కెసిఆర్ మంతనాలు

**కాళేశ్వరం నివేదిక తదితర అంశాలపై చర్చ**

**బిజెపిలో విలీనం అంటూ వస్తున్న వార్తలపైనా ఆరా**

గజ్వేల్,ఆగస్ట్11 : కాళేశ్వరం నివేదక తరవాత మాజీ సిఎం, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ వరుసగా పార్టీ ముఖ్యులతో భేటీ అవుతున్నారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ వేదికగా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన ముఖ్య అనుచరులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై వారు కూలంకుషంగా చర్చించారు. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలకు అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు- సమాచారం. రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు- విచారించిన ఈ కమిషన్.. ఇటీ-వల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు- కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు- చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం.. ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ అంశంపై బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్‌తోపాటు- పలువురు నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని ఆ పార్టీ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారని సమాచారం. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు- ఒక ప్రచారం అయితే ఉధృతంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే ఖండించింది.

# కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు**

న్యూఢిల్లీ,ఆగస్ట్11 : కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. సెలక్షన్ కమిటీ- చేసిన సిఫార్సుల మేరకు కొత్త బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండటంతో సభలో బిల్లుపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడింది. ఈ బిల్లును రాజ్యసభ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ముందుకు వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారి 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో లోక్‌సభలో కేంద్రం ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. దానిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో బిల్లును సెలక్ట్ కమిటీ-కి పంపించింది. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని పార్లమెంటు సెలెక్ట్ కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం కొత్త ఆదాయపు పన్ను బిల్లు-2025ను ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెలక్ట్ కమిటీ- సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు- మంత్రి వెల్లడించారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్లలో ఎన్నో సవరణలు జరిగాయి. సంక్లిష్టంగా తయారన ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్లో ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో కొత్త బిల్లును రూపొందించారు. సవరించిన కొత్త బిల్లు దశాబ్దాల నాటి పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరం చేస్తుందని, వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, అనవసరమైన వ్యాజ్యాలను నివారించడానికి సహాయపడుతుందని బైజయంత్ పాండా అన్నారు.

# హైదరాబాద్‌లో మరోమారు భారీ వర్షం

**అప్రమత్తం అయిన సహాయక బృందాలు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక**

హైదరాబాద్,ఆగస్ట్11 : హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురుసింది. సాయంత్ర నల్లని మేఘావృతం ఆవరించింది నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొటటింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, మూసాపేట్‌లో భారీ వర్షం పడుతుంది. కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్‌లో మోస్తారు వర్షం కురిసినట్లు- సమాచారం. వర్షాలతో ఎక్కడికక్కడ మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో మాన్సూన్ బృందాలు అప్రమత్తమయ్యాయి. ప్రజలు బయటకు రావద్దని మరోమారు హెచ్చరికలు చేశారు. వచ్చే నాలుగైదు రోజులు భారీ అతి భారీ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశమున్న క్రమంలో జిల్లా యంత్రాంగంతో పాటు హైదరాబాద్ అధికారులను అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది వాతావరణ శాఖ.అక్కడక్కడ భారీ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్ళద్దని సూచించింది.ఇప్పటికే జిహెచ్ఎంసి హైడ్రా మాన్సూన్ డిఆర్ఎఫ్, పోలీస్, ట్రాఫిక్ కి ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. ముప్పు ప్రాంతాలు, లోతట్టు- ప్రాంతాలు, మూసి పరవాహక ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించింది. రానున్న నాలుగైదు రోజులపాటు- హైదరాబాద్ తో పాటు- తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయని.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని... దీంతో 13వ తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 13, 14 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 14వ తేదీ ఒకటి రెండు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఇదిలా ఉండగా.. ఇవాళ భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. మిగతా అన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఈ క్రమంలో మంగళవారం 12 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 13, 14 తేదీల్లో హైదరాబాద్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# కాగ్ త్రైమాసిక నివేదిక

**ఆదాయం తగ్గడంపై కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీ-ల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు- అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని..

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి**

శామీర్ పేట కలెక్టరేట్, ఆగస్టు-11 (ది క్రైమ్ న్యూస్) : ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి లతో కలిసి కలెక్టరు (71) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన మార్గనిర్దేశాన్ని అందచేయాలి : జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి









**మేడ్చల్ మల్కాజిగిరి :** సివిల్స్ చేయాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు అవసరమైన మార్గనిర్దే శాన్ని, మెటిరియల్ ను అందించడమే కాకుండా, ఎప్పుడైన సరే అందుబాటులో ఉంటూ మీకు కావలసిన సలహా, సూచనలను అందిస్తానని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తన మెయిల్ ఐడిని విద్యార్థులకు తెలియజేసారు. సోమ వారం కీసర మండలం అంకిరెడ్డి పల్లిలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ లకు నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థులు గౌరవ వందనంతో కలెక్టర్ కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ... స్కూల్, కాలేజీ స్ట్రేంత్ ఎంత మంది విద్యార్థులు న్నారని, బిల్డింగ్ అద్దె ఎంత చెల్లిస్తున్నారని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ వివరాలు తెలుపుతూ యజమాని అద్దె పెంచాలని అడుగుతున్నారని, వాడుకునేందుకు నీరు సరిపో వడం లేదని, ఒక బోరు వేయించాలని, అదే విధంగా చిన్న చిన్న మరమ్మత్తులు ఉన్నాయని కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ స్పందిస్తూ ఎస్టిమేషన్ నివేదికలను తనకు పంపాలని సూచించారు. ఎంఈసి సెకండ్ ఇయర్ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ... గణితం, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల పై వారికి భోధించారు. స్టాక్ మార్కెట్ బ్యాంకింగ్, షేర్స్, టెక్నాలజీ అనాలసిస్, ఫండమెంటల్ అనాలసిస్ వంటి అంశాల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మీరు శ్రద్దగా బాగా చదువుకోవాలని, భవిష్యత్తులో మీకు ఉద్యోగ పరంగా గాని, వ్యాపార పరంగా గాని అవసరమైన సహాయాన్ని తప్పకుండా అందిస్తానని కలెక్టర్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు కలెక్టర్ తెలిపారు. మీరు భవిష్యత్తులో ఎక్కడైన ఇంటర్వ్యూలకు వెళితే సబ్జెక్టు పై పూర్తి విషయ పరిజ్ఞానంతో ఎటువంటి ప్రశ్నలకైన సమాధానమిచ్చే విధంగా సంసిద్ధమై వెళ్లాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న%శీ%, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని ఆరా తీశారు. అనంతరం స్టోర్ లోని వంట సామాగ్రిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో కీసర ఎం ఆర్ఓ అశోక్, ప్రిన్సిపల్ రాజమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు





**నిజాంపేట్ :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 13 మరియు 14 వ డివిజన్ కొలన్ నారాయణ రెడ్డి కాలనీ బి . ఆర్ . ఎస్ నాయకులు వెంకట రమణారెడ్డి జెట్టి, నరేష్ నల్లూరి మరియు శ్రీనివాస రెడ్డి చిర్ర గార్ల మిత్రబృందం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మరియు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపేందర్ మునిని, అప్పారావు గరికిపాటి,పురుషోత్తం కలిమెల, శ్రీనివాస రెడ్డి పింగళి, వెంకటరామి రెడ్డి జెట్టి, రవీందర్ రెడ్డి జెట్టి, నాగరాజు కల్లె, సురేష్ కుక్కల, సీతారామి రెడ్డి జెట్టి, జనార్దన్ రెడ్డి బిజ్జుల, సత్య నారాయణ యాదవ్ దేవరబోయిన, పావం చౌదరి నల్లూరి, సుధీర్ రెడ్డి శానంపూడి, శ్రీధర్ రెడ్డి పోరెడ్డి,శ్రీనివాస రావు అన్నీ, సంతోష్ రెడ్డి కోయగూర, కైలాష్ మధురాంతకన్, కృష్ణా రాడి టేకుల, శ్రీకాంత్ రేరెడ్డి సూరం, సత్యమారాయుడు కెందపల్లి, జయపాల్ రెడ్డి పడమటి, విజయ్ కుమార్ కావూరు, లక్ష్మణ్ రెడ్డి A, నాగి రెడ్డి జొన్నల, వీరారెడ్డి గుత్తికొండ, ప్రవీణ్ రెడ్డి కోడూరు, వీరారెడ్డి దేవరపల్లి, హనుమ ప్రసాద్ వి కె ఎస్, మునిందర్ రెడ్డి కాంతాల, బద్రీ ప్రసాద్ నక్కిమ, అన్వేష్ గౌడ్, సుదర్శన్ రావు డివి, కృష్ణ కిషోర్ నల్లూరి , సింగరావు నల్లూరి, సుధా చిర్రా, ప్రమీల పెమ్మెత్స, అనంత లక్ష్మి జెట్టి, సుధీంద్ర రాజు పెనుమత్స, శ్రీనివాస్ కొండబతిమి, పెమ్మెత్స సుబ్బరాజు, రవి కుమార్ రెడ్డి తీగల కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం జరిగింది . ఈ కార్యక్రమంలో NMC జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, NMC మహిళ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, యశోద, శ్రీదేవి మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను









**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా :** ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ (71) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ... ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోజూ రాత్రి పూట నిద్రకు ముందు గ్లాస్ పసుపు పాలను తాగండి.. చెప్పలేనన్ని లాభాలు కలుగుతాయి..!

పసుపును మనం నిత్యం వంటల్లో వేస్తూనే ఉంటాం. దీన్ని ఎంతో కాలంగా మనం వంటి ఇంటి పదార్థంగానే కాక ఔషధంగా కూడా ఉపయోగిస్తున్నాం. గాయాలు అయినప్పుడు ఎక్కువగా పసుపు రాస్తుంటారు. దీంతో యాంటీ సెప్టిక్‌లా పనిచేస్తుంది. గాయం త్వరగా మానడమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ అవకుండా అడ్డుకుంటుంది. ఇదే కాకుండా పసుపుతో ఇంకా ఎన్నో లాభాలు కలుగుతాయి. అలాగే పాలను కూడా చాలా మంది రోజూ తాగుతూనే ఉంటారు. అయితే రాత్రి పూట పాలలో పసుపును కలిపి తాగితే ఎన్నో లాభాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. పసుపు కలిపిన పాలనే గోల్డెన్ మిల్క్ అని కూడా పిలుస్తారు. ఈ మిశ్రమం పలు వ్యాధులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. రాత్రి పూట ఈ పాలను తాగడం వల్ల అనేక వ్యాధులను నయం చేసుకోవడంతోపాటు పలు ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. వాపులు, నొప్పులు..పసుపు పాలలో శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పాలను సేవిస్తే కణజాల స్థాయిలో వాపులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది. నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. పసుపు పాలను తాగడం వల్ల శరీరంలో అంతర్గతంగా ఏర్పడే వాపులు సైతం తగ్గిపోతాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. పసుపులో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడతుంది. చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే మొటిమలు, మచ్చలు తొలగిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రోగ నిరోధక శక్తికి..పసుపు కలిపిన పాలలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు వంటి వ్యాధులు తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. వైరస్‌లు, బ్యాక్టీరియాలపై శరీరం పోరాటం చేస్తుంది. గొంతు నొప్పి, ఇతర శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవచ్చు. పసుపు కలిపిన పాలను తాగితే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. పైత్య రసాలు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. మనం తిన్న ఆహారంలో ఉండే కొవ్వులను శరీరం సులభంగా జీర్ణం చేస్తుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. పసుపు కలిపిన పాలను తాగుతుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అయి మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. మెదడు పనితీరుకు..పసుపులో ఉండే కర్‌క్యుమిన్ మెదడు పనితీరును మెరుగు పరుస్తుంది. నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మెదడు కణాలు కొత్తగా ఏర్పడేలా చేస్తుంది. దీంతో మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. ఉత్తేజంగా ఉంటారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. కర్‌క్యుమిన్ యాంటీ డిప్రెసెంట్‌గా కూడా పనిచేస్తుంది. అందువల్ల పసుపు పాలను తాగితే మూడ్ మారుతుంది. డిప్రెషన్ నుంచి బయట పడవచ్చు. ఇలా పసుపు పాలు మనకు అనేక విధాలుగా మేలు చేస్తాయి.

# పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా :** ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ సభ్యులు శ్రీ బండారి లక్ష్మా రెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా. డాక్టర్ సి ఉమా గౌరి, జడ్పీహెచ్ఎస్ ఉప్పల్ లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానంగా ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు నులి పురుగుల నిర్మూలన యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా జరుపుకుంటామని తెలిపారు. డాక్టర్ సి. ఉమా గౌరి, మాట్లాడుతూ ఈ వ్యాధి వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలన, వండిన మరియు కలుషితమైన ఆహారం, తీసుకోవడం వంటి వివిధ కారణాలవల్ల పిల్లల్లో వార్మ్ ఇన్ఫెక్షన్ ఏర్పడుతుందని అన్నారు, అందుకే ప్రతి సంవత్స రం ఈ నూలి పురుగుల నివారణ కొరకై ఈ టాబ్లెట్లను పిల్లలు తప్పకుండా వేసుకోవాలని అన్నారు అనంతరం నూలి పురుగుల నివారణకు టాబ్లెట్లను పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కీసర డివిజన్, డాక్టర్ సత్యవతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, డా కౌశిక్, వైద్యాధికారి పీహెచ్‌సీ ఉప్పల్ డా" శౌశీల్య, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిమ్మ ఆకులను ఇలా వాడితే ఎన్నో ప్రయోజనాలు.. ఏయే వ్యాధులకు పనిచేస్తాయంటే..?



నిమ్మకాయలను వాడడం వల్ల ఎన్ని ఉపయోగాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. నిమ్మరసం అనేక ప్రయోజనాలను అందిస్తుంది. దీన్ని మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నిమ్మరసాన్ని కొందరు నేరుగా తాగుతారు. కొందరు గోరు వెచ్చని నీటిలో కలిపి సేవిస్తుంటారు. ఆయుర్వేద ప్రకారం నిమ్మరసం మనకు అనేక లాభాలను అందిస్తుంది. ఎంతో పురాతన కాలం నుంచే నిమ్మకాయలను ఆహారంగా, ఔషధంగా ఉపయోగిస్తున్నారు. అనేక సంప్రదాయ వైద్య విధానాల్లోనూ నిమ్మకాయలను వాడుతారు. అయితే కేవలం నిమ్మకాయలు మాత్రమే కాదు, నిమ్మ ఆకులు కూడా మనకు ఎంతగానో మేలు చేస్తాయి. ఈ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఇవి వ్యాధులను తగ్గిస్తాయి. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. నిమ్మ ఆకులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. చక్కని నిద్రకు..నిమ్మ ఆకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కొద్దిగా తేనె కలిపి తాగవచ్చు. ఈ మిశ్రమం అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. దీన్ని ఒక కప్పు మోతాదులో రోజుకు 2 సార్లు తాగవచ్చు. మీరు రోజూ తాగే టీ, కాఫీలకు బదులుగా ఈ నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. నిమ్మ ఆకుల టీలో అల్లం రసం కలిపి కూడా తాగవచ్చు. దీంతో ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మెదడు ప్రశాంతంగా మారుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఈ ఆకుల టీని సేవిస్తుంటే నాడీ మండల వ్యవస్థ ప్రశాంతంగా మారుతుంది. టెన్షన్ మొత్తం తగ్గిపోయి ప్రశాంతంగా మారుతారు. అలసట, నీరసం తగ్గిపోతాయి. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..నిమ్మ ఆకుల టీని సేవిస్తుంటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. నిమ్మ ఆకుల్లో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి శరీరానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కణాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఈ ఆకులతో తయారు చేసిన టీని రోజుకు 2 సార్లు తాగుతుంటే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. ఆ ఆకుల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో దగ్గు, జలుబు తగ్గిపోతాయి. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. ఇలా వాడాలి..నిమ్మ ఆకులు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ వీటిని చెట్టు నుంచి తెంపిన తరువాత శుభ్రంగా కడగాలి. లేదంటే ఆకులపై ఉండే కృత్రిమ ఎరువులు, క్రిమి సంహారక మందుల తాలూకు అవశేషాలు మన శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు సేంద్రీయ పద్ధతిలో పెంచిన నిమ్మ చెట్ల నుంచి సేకరించిన ఆకులను వాడితే మంచిది. కొందరికి సిట్రస్ అలర్జీ ఉంటుంది. అలాంటి వారు నిమ్మ ఆకులను ఉపయోగించకూడదు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు నిమ్మ ఆకులను వాడే ముందు డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. నిమ్మ ఆకులతో తయారు చేసిన నీళ్లను స్నానం చేసే నీటిలో పోసి ఆ నీటితో స్నానం చేస్తే శరీరం తాజాగా మారుతుంది. చెమట వాసన రాకుండా ఉంటుంది. నిమ్మ ఆకులను పేస్ట్‌లా చేసి అందులో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి రాసి కాసేపు అయ్యాక కడిగేయాలి. ఇలా చేస్తుంటే ముఖం నిగారింపును సంతరించుకుంటుంది. నిమ్మ ఆకుల పేస్ట్‌లో పెరుగు కలిపి జుట్టుకు రాస్తుంటే జుట్టు రాలడం తగ్గిపోతుంది. శిరోజాలు ఒత్తుగా పెరిగి దృఢంగా మారుతాయి. కాంతివంతంగా కనిపిస్తాయి. ఇలా నిమ్మ ఆకులతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# నాలుక పగలకుండా ఉండాలంటే పైనాపిల్ పండ్లను అసలు ఎలా తినాలి..? వీటితో కలిగే లాభాలు ఏమిటి..?

పైనాపిల్ పండ్లు మనకు దాదాపుగా ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లను నేరుగా తినలేరు. కానీ జ్యూస్ చేసుకుని మాత్రం తాగుతారు. అయితే పైనాపిల్ పండ్లను నేరుగా తింటే నాలుక పగిలినట్లు అవుతుంది. అందుకనే ఈ పండ్లను నేరుగా తినేందుకు ఇష్టపడరు. పైనాపిల్ పండ్లలో బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను జీర్ణం చేస్తుంది. అందుకనే ఈ పండ్లను తింటే నాలుక పగిలినట్లు అవుతుంది. అయితే ఇలా జరగకుండా ఉండాలంటే ఈ పండ్ల ముక్కలపై కాస్త ఉప్పు చల్లి తినాలి. లేదా పైనాపిల్ ముక్కలను పెనంపై కాస్త వేయించి రోస్ట్‌లా చేసి తినాలి. దీంతో బ్రొమెలెయిన్ ప్రభావం తగ్గుతుంది. నాలుక పగలదు. ఇక పైనాపిల్ పండ్లను రోజూ ఒక కప్పు మోతాదులో తినాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. దీంతో అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు. నాన్ వెజ్ సులభంగా జీర్ణం..పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ మనం తిన్న ఆహారాన్ని జీర్ణం చేసేందుకు సహాయం చేస్తుంది. ముఖ్యంగా ప్రోటీన్లను త్వరగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. అందువల్ల నాన్ వెజ్ వంటి ఆహారాలను తింటే సులభంగా జీర్ణం అయ్యేందుకు గాను పైనాపిల్ ముక్కలను తినాలి. ఈ పండ్లను తింటే అజీర్తి తగ్గుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ వంటి సమస్యలు ఏర్పడకుండా ఉంటాయి. పైనాపిల్ పండ్లను రోజుకు ఒక కప్పు మోతాదులో తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. ఎముకల దృఢత్వానికి..పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను సైతం కలిగి ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కోవాలంటే పైనాపిల్ పండ్లను రోజూ తింటుండాలి. దీంతో ఎంతో మేలు జరుగుతుంది. పైనాపిల్ పండ్లలో మాంగనీస్ అధికంగా ఉంటుంది. ఇది ఎముకల నిర్మాణానికి దోహదం చేస్తుంది. ఎముకలు దృఢంగా మారేలా చూస్తుంది. పైనాపిల్ పండ్లను రోజూ ఒక కప్పు మోతాదులో తింటే చాలు మనకు రోజుకు కావల్సిన మాంగనీస్ లభిస్తుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ పండ్లలో విటమిన్ సితోపాటు ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్స్ అనబడే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి కణాలను రక్షిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి, శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. శ్వాసకోశ సమస్యలకు..పైనాపిల్ పండ్లలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు శ్వాసకోశ సమస్యలను తగ్గిస్తాయి. ముఖ్యంగా సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. శ్వాస నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోయి గాలి సరిగ్గా లభిస్తుంది. అయితే పైనాపిల్ పండ్లు ఆరోగ్యకరమే అయినప్పటికీ రోజుకు ఒక కప్పుకు మించి తినరాదు. తింటే సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశాలు ఉంటాయి. పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కొందరికి పైనాపిల్ పండ్లలో ఉండే బ్రొమెలెయిన్ పడదు. వికారం, వాంతులను కలగజేసే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు కూడా ఈ పండ్లను తినకూడదు.

విశ్వజి



## కాస్మొటిక్స్‌తో కాదు ఈ ఆహారాలతో మీ చర్మానికి నిగారింపు.. ట్రై చెయ్యండి!


చాలామంది చర్మం అందంగా ఉండడం కోసం, ఆరోగ్యంగా ఉండడం కోసం రకరకాల ప్రయోగాలు చేస్తారు. చర్మం నికారింపును సొంతం చేసుకోవడానికి రకరకాల కాస్మోటిక్స్ ను ఉపయోగిస్తారు. అయితే ఎటువంటి సౌందర్య క్రీములు ఉపయోగించకుండా కేవలం మంచి ఆహారంతోనే చర్మం మెరిసిపోయేలా చేయవచ్చని చెబుతున్నారు వైద్య నిపుణులు. చర్మానికి ఆహారంతో పోషణ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి అవసరమైన పోషణ అందించడానికి కొన్ని ఆహారాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెబుతున్నారు. చర్మ సౌందర్యాన్ని మరింత పెంచే, అద్భుతమైన నిగారింపును ఇచ్చే అటువంటి ఆహారం గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. మనం తినే ఆహారంలో పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాలు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. అవకాడో చర్మం ఆరోగ్యంగా అందంగా ఉండాలంటే, నిగారింపును సొంతం చేసుకోవాలంటే అవకాడో ఎంతగానో దోహదం చేస్తుంది. అవకాడోలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ పుష్కలంగా లభిస్తాయి. ఇది మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ముఖం మీద ముడతలను నివారిస్తాయి. ఆకుకూరలు కూరగాయలు చర్మం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారంలో బచ్చలికూరతో పాటు పాలకూర, తోటకూర వంటి ఆకుకూరలు ఎంతగానో దోహదం చేస్తాయి.ఇక ఆహారంలో గుమ్మడికాయ, దోసకాయ, టమాటా వంటి కూరగాయలు కూడా చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను తింటే అవి చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడతాయి ఫలితంగా చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. నట్స్ మరియు సీడ్స్ బాదంపప్పు, జీడిపప్పు వంటి వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ ను తింటే చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. బయోటిన్, ప్రోటీన్, విటమిన్ ఈ తో ఉన్న నట్స్, సీడ్స్ మన చర్మాన్ని రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రభావాలను తగ్గిస్తాయి. నీరు ఎక్కువ తీసుకోవడం వయసు పెరిగే కొద్దీ చర్మం పైన ముడతలు సహజంగా వస్తూ ఉంటాయి. అయితే రోజు శరీరానికి కావాల్సినంత నీటిని ఇస్తే ఇవి ముడతలు రాకుండా చేసి చర్మం హైడ్రేటెడ్ గా బిగుతుగా ఉండేలా చూస్తాయి. మీరు ఎక్కువగా నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ కూడా మెరుగు అవుతుంది. అంతేకాదు ఇది చర్మానికి నిగారింపును ఇస్తుంది.

# డయాబెటిస్ ఉంటే కొబ్బరినీళ్ళు తాగొచ్చా?

కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి నీళ్లలో ఉండే హైడ్రేటింగ్ లక్షణాలు మరియు పోషక పదార్థాలు మన శరీరానికి కావలసిన శక్తినిస్తాయి. అయితే, మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీళ్ల తాగొచ్చా? కొబ్బరి నీళ్లు తాగితే షుగర్ పెరుగుతుందా? వంటి అనుమానాలతో ఉంటారు . కొబ్బరి నీళ్లు తాగితే మధుమేహ వ్యాధిగ్రస్తుల రక్తంలో చక్కెర పెరుగుతుందా? తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని చదవండి. కొబ్బరి నీళ్ళలో ఫుల్ పోషకాలు కొబ్బరి నీరు తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది. కొబ్బరి నీళ్లలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు మరియు ఖనిజాలు ఉంటాయి. ఇది పొటాషియం, మెగ్నీషియం మరియు విటమిన్ %జ% ని అందిస్తుంది. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యానికి మద్దతుని ఇస్తాయి. డయాబెటిస్ లేనివారికి కొబ్బరి నీళ్ళు మంచి పోషకాలతో కూడిన పానీయం. అయితే మధుమేహంతో బాధపడే వారు మాత్రం కొబ్బరి నీళ్ల విషయంలో కాస్త జాగ్రత్తగానే ఉండాలి. రక్తంలో చక్కెరపై ప్రభావం కొబ్బరి నీళ్లలో ఉండే సహజ చక్కెర కంటెంట్ కారణంగా ఇది రక్తంలో చక్కెరను నిదానంగా పెంచుతుంది. కొబ్బరి నీరు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండడం వల్ల రక్తంలో చక్కెరను నెమ్మదిగా పెంచుతుంది. అయితే, గ్లూకోజ్ స్థాయిలలో పెరుగుదలను నివారించడానికి కొబ్బరినీళ్ళ విషయంలో జాగ్రత్త పాటించడం అవసరం. %ళాశీషవతీవస దీఎ% మధుమేహ రోగులకు కొబ్బరి నీళ్ళతో ప్రయోజనాలు, కానీ కొబ్బరి నీటిలోని ఎలక్ట్రోలైట్లు హైడ్రేషన్‌ను నిర్వహించడంలో సహాయపడతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా అవసరం. పొటాషియం రక్తపోటును నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది. మెగ్నీషియం ఇన్సులిన్ సున్నితత్వానికి సహాయపడుతుంది, గ్లూకోజ్ నియంత్రణకు ప్రయోజనం కలిగిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కొబ్బరి నీళ్లను తాగితే ప్రయోజనాలు ఉంటాయి, కానీ బాగా ఎక్కువగా తాగడం మాత్రం మంచిది కాదు. ఇలా ఉంటే కొబ్బరి నీళ్ళు తాగొద్దు కొబ్బరి నీళ్లను తాగిన తర్వాత కూడా చక్కెర స్థాయిలను పర్యవేక్షించటం కూడా అవసరం.కొబ్బరి నీళ్ళను డయాబెటిస్ బాధితులు తీసుకోవాలి అనుకుంటే వైద్యుల సలహా మేరకు తీసుకుంటే మంచిది. డయాబెటిస్ బారిన పడిన, ముఖ్యంగా మూత్ర పిండాల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు కొబ్బరి నీళ్ళ జోలికి వెళ్ళకుండా ఉంటేనే మంచిది.



# పచ్చి బొప్పాయితో ఆరోగ్య అద్భుతాలు.. తెలిస్తే వదిలిపెట్టరు!



బొప్పాయి పండు మాత్రమే కాదు పచ్చి బొప్పాయి కాయ కూడా మనకు ఎంతో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. పచ్చి బొప్పాయి లో ఉండే పోషకాలు అన్ని ఇన్ని కాదు. పచ్చి బొప్పాయి లో కొవ్వులు, కార్బోహైడ్రేట్లను విచ్ఛిన్నం చేసే ఛైమో పాపైన్, పాపైన్ వంటి సహజ ఎంజైమ్స్ ఉంటాయి. పచ్చి బొప్పాయి కాయలో ఉండే ఫైబర్ న్యూట్రియంట్లు మన ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి బొప్పాయితో ఈ హెల్త్ బెనిఫిట్స్ పచ్చి బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్ లు, విటమిన్లు మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. పచ్చి బొప్పాయి తినడం వల్ల మన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. బొప్పాయి కాయ మన శరీరాన్ని శుభ్రం చేయడంలో ఎంతగానో దోహదం చేస్తుంది. గ్యాస్ సమస్యలను, అజీర్ణాన్ని, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మలబద్ధకాన్ని నివారిస్తుంది. మన శరీరంలో నుండి టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. పచ్చి బొప్పాయితో ఈ సమస్యలకు చెక్ పచ్చి బొప్పాయి కాయ మన శరీర కొత్త కణాలను నిర్మించడానికి వాటిని మరమ్మతు చేయడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గొంతు ఇన్ఫెక్షన్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్, రుతుస్రావ సమస్యల వల్ల శరీరంలో కలిగే నొప్పులు, వాపులు, మంటలను పచ్చి బొప్పాయి కాయ సమర్థవంతంగా తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పచ్చి బొప్పాయిలో పొటాషియం, ఫైబర్, ఫోలేట్ ఉంటాయి. పచ్చి బొప్పాయితో క్యాన్సర్ నుండి రక్షణ పచ్చి బొప్పాయి కాయ రక్తపోటుని తగ్గించడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మగవారికి ఎంతో ఉపయోగపడుతుంది. పురుషులలో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్ వంటి క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే డైటరీ ఫైబర్ పెద్ద పేగుల్లో ఉండే టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. 'ఆ డైరెక్టర్ వలలో చిక్కిన మోనాలిసా.. హీరోయిన్ ను చేస్తానని చెప్పి..' ఆహారంలో పచ్చి బొప్పాయితో మేలు ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇచ్చే పచ్చి బొప్పాయి కాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎంతో మంచిది. పచ్చి బొప్పాయి కాయను కూరగా వండుకుని, పచ్చడి చేసుకుని, వివిధ రకాలుగా మనం ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.

# మార్కెట్

## అమల్లోకి ఫాస్టాగ్ కొత్త రూల్స్.. పాటించకపోతే అంతే సంగతులు

జాతీయ రహదారులపై ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. టోల్ గేట్ల వద్ద లావాదేవీలు సులువుగా జరిగేలా, మోసాలు నివారించేలా తీసుకువచ్చిన ఈ నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త రూల్స్ ప్రకారం. వాహనం టోల్ బూత్‌కు చేరడానికి ముందు 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ అయి ఉన్నా, హాట్‌లిస్ట్‌లో ఉన్నా, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నా టోల్ బూత్ వద్ద ఫాస్టాగ్ లావాదేవీ విఫలమవుతుంది. టోల్ బూత్ వద్ద స్కాన్ చేసిన తర్వాత 10 నిమిషాల వరకు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌గా ఉన్నా లావాదేవీ తిరస్కరణకు గురవుతుంది. ఈ రెండు సందర్భాల్లో 176 ఎర్రర్ కోడ్‌తో లావాదేవీ విఫలమవుతుంది. ఇలా అయితే, వాహనానికి జరిమానా కింద రెట్టింపు టోల్ చార్జ్ పడుతుంది. ఈ రూల్స్‌కు అనుగుణంగా వాహనదారులు ముందుగానే జాగ్రత్త పడటం మంచిది. లేదంటే మీ జేబులకు చిల్లు పడటం ఖాయం.



## పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. భారీగా పతనమైన ధరలు..



### హైదరాబాద్‌లో ధరలివే..!

పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. బంగారం ధరలు ఇటీవల గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు దిగి వస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో స్టాకిస్టులు అమ్మకాలకు దిగుతున్నారు. ఐదురోజుల తర్వాత సోమవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి పతనమయ్యాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.900 తగ్గి తులానికి రూ.1,02,520కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ ధర సైతం రూ.900 తగ్గడంతో తులానికి రూ.1,02,100కి చేరుకుంది. అయితే, బంగారం గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రూ.5800 పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ తగ్గడంతో ధర దిగివస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా.. ట్రంప్ శాంతి ప్రయత్నాల నేపథ్యంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారు. అలాస్కాలో కలిసేందుకు అంగీకరించడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని, దాంతో విలువైన ఆస్తులకు డిమాండ్ తగ్గినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గోల్డ్ బార్స్‌పై 39శాతం సుంకాలకు సంబంధించి వైట్‌హౌస్ స్పష్టతనివ్వడంతో ధరలపై ఒత్తిడి తెచ్చిందని తెలిపారు. సోమవారం వెండి ధర కిలోకు రూ.1000 తగ్గి రూ.1,14,000కి చేరుకుంది. వెండి సైతం గత ఐదురోజుల్లో కిలోకు రూ.2,500 పెరిగిన విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో గోల్డ్ ఫ్యూచర్ ఔన్స్‌కు 40.61 డాలర్లు తగ్గి 3,358.17కి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ కాంట్రాక్టుకు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు తగ్గి 1.26శాతం తగ్గి రూ.1,00,518 వద్ద ట్రేడవుతున్నది. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపిన ప్రకారం.. బంగారం ఒకశాతానికి తగ్గింది. గతవారంలో ధరల పెరుగుదల లాభాలన్నింటిని తుడిచిపెట్టేశాయి. బంగారం ఉత్పత్తులపై సుంకాలపై వచ్చిన వార్తలన్నీ తప్పుడు సమాచారంగా ట్రంప్ పరిపాలన పేర్కొనగా.. మార్కెట్ వర్గాలన్నీ మరింత స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. స్పాట్ సిల్వర్ 1.39 శాతం తగ్గి ఔన్సుకు 37.81 డాలర్లకు చేరింది. ఏంజెల్ వన్‌లో వ్యవసాయేతర వస్తువులు, కరెన్సీల డీవీపీ పరిశోధన నిపుణుడు ప్రథమేష్ మాల్యా మాట్లాడుతూ సుంకాలు ప్రపంచవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించాయన్నారు. మరింత పెరిగితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఔన్స్‌కు 3800 డాలర్ల వరకు చేరుకోవచ్చన్నారు. రాబోయే మూడు నెలల్లో ఎంసీఎక్స్ ఫ్యూచర్ పది గ్రాములకు రూ.1.10లక్షలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,02,280 పలుకుతుండగా.. 22 క్యారెట్ల పుత్తడి రూ.93,750గా ఉన్నది. కిలో వెండి రూ.1.27లక్షలు పలుకుతున్నది.

## యాపిల్ కన్నా.. రిలయన్సే మిన్న

**అత్యుత్తమ బ్రాండ్లలో ప్రపంచంలోనే రెండో స్థానం**

**ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ సంస్థ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: యాపిల్, నైక్ తదితర గ్లోబల్ దిగ్గజ బ్రాండ్లను వెనక్కునెట్టి భారతీయ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అత్యుత్తమ బ్రాండ్ల జాబితాలో దూసుకుపోయింది. తాజాగా విడుదలైన ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024 లిస్టులో సామ్‌సంగ్ తర్వాత బెస్ట్ బ్రాండ్‌గా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతే యాపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టొయోటా వంటి ప్రముఖ సంస్థలుండటం గమనార్హం. కాగా, 2023తో పోల్చితే 2024లో సామ్‌సంగ్ 5వ స్థానం నుంచి నెంబర్ 1కు చేరింది. ఇక రిలయన్స్ 13 నుంచి 2కు వచ్చింది. అయితే యాపిల్ 1 నుంచి 3కు దిగజారింది. 2014లో అగ్రస్థానంలో ఉన్న గూగుల్.. 2024లో 57కు పడిపోయింది. మెటా కూడా 11 నుంచి 52కు దిగొచ్చింది. బోయింగ్, ఫోక్స్‌వాగన్ సంస్థలకైతే తాజా ర్యాంకింగ్స్‌లో చోటే లేకుండా పోయింది. ఇదిలావుంటే ఈసారి జాబితాలో రిలయన్స్ మినహా మరే ఇతర భారతీయ సంస్థలు లేవు. 'గడిచిన దశాబ్దానికిపైగా ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. విజయవంతమైన బ్రాండ్లు మనుగడ సాగించడంపైనేగాక, నిలకడైన వృద్ధిని ఎలా నిలబెట్టుకుంటున్నాయో తెలియపరుస్తున్నది' అని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. కాగా, ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. ఓ వార్షిక అధ్యయనం. మార్కెట్ క్యాపిటలైజేషన్, మరికొన్ని అంశాల ద్వారా టాప్-100 కంపెనీలతో ఓ జాబితాను సిద్ధం చేస్తుంది.







# సినిమా వేరు.. వ్యక్తిగత జీవితం వేరు: రష్మిక

సామాజిక మాధ్యమాల్లో ఎన్ని విమర్శలు ఎదురైనప్పటికీ దృఢంగా ఉండి.. నా కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నానని అందాల తార రష్మిక అంటోంది. 'పుష్ప 2', 'కుబేర' చిత్రాలతో వరుస విజయాలందుకొని జోరుమీదుందీ భామ. ప్రస్తుతం మహిళా ప్రాధాన్య కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. తన భావోద్వేగాలను ప్రజల ముందు ప్రదర్శించడానికి ఇష్టపడనని అంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ.. నేను ఒక నటిని. నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుంది. నేను ఇంట్లో ఎలా ఉంటానో చూస్తే మీరు ఆశ్చర్యపోతారు. చాలా ఎమోషనల్ పర్సన్‌ని నేను. కానీ నేను నా భావోద్వేగాలను బయటికి చూపించను. ఎందుకంటే అభిమానులు నా దయా గుణాన్ని నా బలహీనత అనుకుంటారు. లేకపోతే నేను కెమెరాల కోసమే ఇదంతా చేస్తున్నా అనుకుంటారు. మనం ఎంత నిజాయతీగా ఉంటే.. అంత వ్యతిరేకత మనపై వస్తుంది. దీంతో పాటు నా చుట్టూ ఉండే నెగిటివిటీతో ప్రభావితం కాకుండా ఉండటానికి కూడా చాలా కష్టపడుతున్నానని చెప్పుకొచ్చింది.




# సినీ ప్రేక్షకులక ఇక పండగే

## సందడి చేయనున్న కూలీ, వార్-2


సినీ ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయం రానే వచ్చింది. మరో మూడు రోజుల్లో రెండు పెద్ద సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇందులో ఒకటి సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న కూలీ సినిమా కాగా.. మరొకటి హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న వార్ 2. ఈ రెండు సినిమాలు ఇండిపెండెన్స్ డే కానుకగా.. ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. విడుదలకు ఇంకా మూడు రోజులే ఉండడంతో భారీ ఎత్తున్న ప్రమోషన్స్ చేస్తున్నారు మేకర్స్. ఒకవైపు కూలీ సినిమాకు లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించనుండటం.. నాగర్జున, ఆమిర్ ఖాన్, ఉపేంద్ర, వంటి అగ్ర తారలు నటిస్తుండటంతో మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే వార్ 2 సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించటం.. ఎన్టీఆర్ కూడా ఈ ఫ్రాంచైజీలో భాగం కావడంతో అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ వీకెండ్ ఈ రెండు చిత్రాలే కాకుండా ఓటీటీలో కూడా పలు సినిమాలు సందడి చేయబోతున్నాయి.




# సుధీర్ బాబు.. నిఖిల్ సినిమాలు


## ఇద్దరికీ పరీక్ష పెట్టనున్న జటాధర, స్వయంభు


ఒక్కోసారి కథ కాదు టైటిల్ లోనే పవర్ కనిపిస్తుంది. ఆడియన్స్ ను ముందు థియేటర్ కి రప్పించేవి – టైటిల్సే. అలాంటి ఓ మంచి టైటిలే జటాధర... ఒక పవిత్రమైన శబ్దం. శివుడి రూపం. శాంతంగా కనిపించినా శత్రువుల మీద శివతాండవం చేస్తాడు. ఇప్పుడు అదే ఫార్ములాతో సుధీర్ బాబు మళ్లీ వచ్చాడు! మాస్ హిట్ కోసం ఎదురు చూస్తున్న సుధీర్ బాబుకు ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఫీలవుతున్నారు ఆయన ఫ్యాన్స్. తెలుగు, హిందీ రెండు భాషల్లో రానున్న ఈ సినిమాలో సోనాక్షి సిన్హా హీరోయిన్. భాగీతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన సుధీర్ బాబు ఈసారి ఎపిక్ వార్ జటాధర తో ఎలాంటి హైప్ క్రియేట్ చేసుకుంటాడో చూడాలి...ఈసారి హిట్ కొడితే తెలుగులో ఆయన కెరీర్‌లో టర్నింగ్ పాయింటే అవ్వాలని, ఫెయిల్యూర్స్ ని ఎరేజ్ చేసే ఎపిక్ వార్ జటాధర కావాలని ఆయన అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఇక నిఖిల్ కార్తికేయ 2 వంటి భక్తి , మిస్టరీ, యాక్షన్ థ్రిల్లర్ తో పాన్ ఇండియా విజయం అందుకున్నాడు. ఇప్పుడు అదే షేడ్స్ తో 'స్వయంభు' వస్తోంది. స్వయంభు లో మహాభారతం టచ్, హీరో లుక్‌లో వారియర్ వైబ్రేషన్, విజువల్స్‌లో ఓ ఎపిక్ వార్ ఫీల్ కనిపిస్తోంది. మోషన్ పోస్టర్ , ఓపెనింగ్ గ్లింప్స్ గ్రాండియర్ లుక్ లో కనిపిస్తున్నాయి. ఫుల్ క్లాస్ ఎండ్ మాస్ అప్పీల్ తో ఈ సినిమా రాబోతున్నట్టు కనిపిస్తోంది. డైరెక్టర్ భరత్ క్రిష్ణమాచారి విజువల్ స్కేల్ కు ప్రాధాన్యం ఇస్తున్నాడు. బాహుబలి, ట్రిపుల్ లాంటి విజువల్ వండర్స్ కి రూపం ఇచ్చిన సెంథిల్ కుమార్ స్వయంభుకి సినిమాటోగ్రాఫర్ గా చేస్తున్నాడు. నిఖిల్ సరసన సంయుక్త మీనన్ నటిస్తోంది. దాంతో స్వయంభు మీద భారీ ఆశలే పెట్టుకున్నాడు నిఖిల్. ఇద్దరి యంగ్ హీరోలకు ఇప్పుడు హిట్ అనేది చాలా కీలకం.




# మాస్ జాతర టీజర్ విడుదల


కథానాయకుడు రవితేజ నుంచి రానున్న 75వ చిత్రం 'మాస్ జాతర'భాను భోగవరపు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయిక. ఆగస్టు 27న ఇది విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ పోలీస్ పాత్రలో 'నాకంటూ ఓ చరిత్ర ఉంది..' అంటూ మాస్ డైలాగులతో అలరిస్తూ కనిపించారు. ఈ మాస్ మహారాజ్ పంచ్‌లు వేస్తోన్న టీజర్‌ను చూసిన వారు బాగుందని అంటున్నారు.




# సత్యదేవ్ కథానాకుడిగా ఆర్‌బి వర్కింగ్ టైటిల్

కేరాఫ్ కంచరపాలెం' ,'ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు వెంకటేశ్ మహా. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఈ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సినిమాల అనంతరం వెంకటేశ్ చాలా రోజుల గ్యాప్ తర్వాత తన కొత్త సినిమాను ప్రకటించాడు. ఆర్‌బీ అనే వర్కింగ్ –టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో సత్యదేవ్ కథానాయకుడిగా నటించబోతుండగా.. జీఎంబీ, శ్రీచక్ర ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై మహేశ్ బాబు, అనురాగ్ రెడ్డి నిర్మించబోతున్నట్లు– సమాచారం. ఈ సినిమా –టైటిల్‌తో పాటు– ఫస్ట్ లుక్‌ని మంగళవారం గంటలకు విడుదల చేయబోతున్నట్లు– చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.




# వందకోట్ల క్లబ్‌లో చేరిన కింగ్‌డమ్

కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ విషయాన్ని చిత్రబృందం ప్రకటించింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఈ సినిమాకు నాగవంశీ నిర్మాతగ వ్యవహారించగా.. భాగ్యశ్రీ భోర్సే కథానాయికగా నటించింది. అయితే జూలై 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు– మేకర్స్ ప్రకటించారు. దీంతో గీతా గోవిందం(రూ.130 కోట్లు–) తర్వాత రెండోసారి రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన హీరోగా విజయ్ రికార్డును అందుకున్నాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com